

జిల్లా పంచాయతీ ఏవోగా రాజాబాబు

సుభాష్‌నగర్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లా పంచాయతీ కార్యాలయం ఏవోగా రాజాబాబు గురువారం బాధ్య తలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఏవో పోస్టు ఖాళీగా ఉండగా సీనియర్ అసిస్టెంట్‌గా ఉన్న రాజాబాబుకు పదోన్నతి కల్పించి ఇక్కడే పోస్టింగ్ ఇచ్చారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న రాజాబాబు

అలీసాగర్ ఆయకట్టుకు 50 వేల ఎకరాల సాగు నీరు

● ఏ.రమేష్, బోధన్ డివిజన్ ఇరిగేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్



ఫేస్‌టూఫేస్

ప్ర: అలీసాగర్ ప్రాజెక్టు ద్వారా ఆయకట్టుకు ఎన్ని ఎకరాలకు సాగు నీరు విడుదల చేస్తున్నారు.

జ: అలీసాగర్ ప్రాజెక్టు మూడు నెంబర్ల పంప్‌హౌస్‌లు ఉన్నాయి. ఈ ప్రాజెక్టు కింద 50వేల ఎకరాలకు ఆయకట్టుకు సాగునీరు అందుతోంది.

ప్ర: బెల్లాల్ చెరువుకు సంబంధించిన ఫీడర్ ఛానల్ పనులు ఎంత వరకు వచ్చాయి.

జ: ఫీడర్ ఛానల్ రిపేర్ వర్క్‌కు సుమారు 8లక్షల రూపాయలు మంజూరయ్యాయి. త్వరలో టెండర్లను పిలిచి పనులు ప్రారంభిస్తాం.

ప్ర: బోధన్ డివిజన్‌లోని చెక్‌డ్యామ్‌ల పరిస్థితి ఏమిటీ?

జ: బోధన్ డివిజన్‌లో ఆరు కొత్త చెక్ డ్యామ్‌లు నిర్మించాం. ఆరు చెక్‌డ్యామ్‌లు కూడా పూర్తిగా నీటితో నిండి సుమారు 10వేల నుంచి 12 వేల ఎకరాల వరకు జిల్లాలోని ఆయకట్టుకు నీరు అందుతోంది.


- బోధన్, ఆంధ్రజ్యోతి



యంచ గోదావరికి పోటెత్తిన వరద

8

నగర పాలక సంస్థకు ప్రధాన విభాగంగా ఉన్న రెవెన్యూ విభాగం అవినీతిలో కూరుకుపోయి కార్పొరేషన్‌కు చెడ్డపేరు తీసుకువస్తున్న క్రమంలో ప్రత్యేక అధికారి, కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్‌కుమార్‌లు ఆ విభాగాన్ని పూర్తిగా ప్రక్షాళన చేసే దిశగా అడుగులు వేస్తున్నారు. ఇప్పటికే రెవెన్యూ ఆఫీసర్, ఆర్ఐలను మార్చిన అధికారులు రెవెన్యూ విభాగాన్ని అడిషనల్ కమిషనర్‌గా ఇటీవలే బాధ్యతలు తీసుకున్న రవీంద్రసాగర్‌కు అప్పగించనున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం రెవెన్యూ విభాగం బాధ్యతలు నిర్వహిస్తున్న అధికారిపై అనేక అవినీతి ఆరోపణలు ఉన్న నేపథ్యంలో అడిషనల్ కమిషనర్ స్థాయి కలిగిన అధికారికి రెవెన్యూ విభాగం అప్పగించాలని కలెక్టర్, నగర కమిషనర్ నిర్ణయించినట్లు సమాచారం.



కార్పొరేషన్ రెవెన్యూ విభాగం

ప్రక్షాళన ఎప్పుడో?



నగర పాలక సంస్థలో రాజ్యమేలుతున్న అవినీతి ఆరోపణలు!

- అవినీతి అక్రమాలకు నిలయంగా మారిన నగర మున్సిపల్ కార్పొరేషన్
- నగర పాలక సంస్థ రెవెన్యూ, టౌన్‌ప్లానింగ్, ఇతర విభాగాలపై కలెక్టర్ పలుమార్లు సమీక్ష
- రెవెన్యూ విభాగంపై కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి స్పెషల్ ఫోకస్
- అడిషనల్ కమిషనర్‌కు రెవెన్యూ శాఖను అప్పగించే అవకాశం

నిజామాబాద్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): నిజామాబాద్ నగర పాలక సంస్థ రెవెన్యూ విభాగం ప్రక్షాళన దిశగా సాగుతుందా? అనే విషయంలో ఒకటి రెండు రోజుల్లో స్పష్టత వచ్చే అవకాశాలు ఉన్నాయి. ఇటీవల నగర పాలక సంస్థపై ఏసీబీ దాడుల నేపథ్యంలో కలెక్టర్, నగర పాలక సంస్థ ప్రత్యేక అధికారి వినయ్‌కృష్ణారెడ్డి రెవెన్యూ శాఖపై ప్రత్యేక శ్రద్ధ పెట్టారు. ఇప్పటికే పలుమార్లు కమిషనర్‌తో రెవెన్యూ శాఖపై సమీక్షలు నిర్వహించిన కలెక్టర్ పూర్తిగా రెవెన్యూ శాఖను ప్రక్షాళన చేసేందుకే సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. రెవెన్యూ శాఖను అడిషనల్ కమిషనర్‌కు అప్పగించేందుకు దస్త్రం సిద్ధం చేసినట్లు ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే పలుమార్లు కలెక్టర్ నగర పాలక సంస్థ ముఖ్య విభాగాలైన రెవెన్యూ, టౌన్‌ప్లానింగ్, ఇతర విభాగాలపై సమీక్షలు నిర్వహించి మార్పులు, చేర్పులపై ఒక క్లారిటీకి వచ్చినట్లు సమాచారం. ఇప్పటికే నగర పాలక సంస్థ కమిషనర్ రెవెన్యూ ఆఫీసర్‌తో పాటు ఆర్ఐలను మార్చారు. ప్రస్తుతం డిప్యూటీ కమిషనర్‌గా పనిచేస్తున్న రవిబాబుకు రెవెన్యూ శాఖ తాత్కాలిక బాధ్యతలు అప్పగించారు.

మిగతా 8వ పేజీలో...

మూడేళ్లుగా కార్పొరేషన్ కార్యాలయం చుట్టూ..

నగరంలోని న్యాల్‌కల్ రోడ్‌లోగల వివేకానంద కాలనీకి చెందిన పెంట అనసూయ అనే మహిళకు ఇంటి నెంబర్ 3-10-424/1బి పైన 55 గజాల రేకుల ఇళ్లు ఉంది. ఆమె వికలాంగురాలు. 2020 ఆగస్టు 12 వరకు ఆమె పేరు మీద ఉన్న టాక్స్‌ను ఇప్పుడు బొజ్జిని గౌతమ్‌కుమార్ పేరుతో మున్సిపల్ రెవెన్యూ అధికారులు మార్చారు. 2020 వరకు అనసూయ తన ఇంటి టాక్స్‌ను కట్టింది. ఇప్పుడు కూడా ఆ ఇంటిలోనే నివాసం ఉంటుంది. 1046049244 అసిస్‌మెంట్ నెంబర్‌పై 2020 వరకు అనసూయ పేరుపైనే వచ్చిన టాక్స్ ఐదేళ్లుగా గౌతమ్‌కుమార్ పేరుతో వస్తోంది. ఇప్పటికే రెవెన్యూ విభాగంలో పలుమార్లు వినతిపత్రం ఇచ్చినప్పటికీ అధికారులు మాత్రం ఆమె పేరుపైకి టాక్స్ మార్చడం లేదు.



దివ్యాంగురాలు అనసూయ



కార్యాలయానికి తాళం వేస్తున్న దృశ్యం

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి తాళం

- 36 నెలలుగా అద్దె చెల్లించని అధికారులు
- సబ్ రిజిస్ట్రార్ హామీతో తాళం తొలగించిన యజమాని
- ఆలస్యంగా ప్రారంభమైన రిజిస్ట్రేషన్ కార్యకలాపాలు


బోధన్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): బోధన్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి గురువారం భవన యజమాని శరత్ తాళం వేశారు. అధికారులు 36 నెలలుగా అద్దె చెల్లించక పోవడంతో యజమాని కార్యాలయానికి తాళం వేశాడు. దీంతో అధికారులు, రిజిస్ట్రేషన్ కోసం వచ్చిన వారు కార్యాలయం ఎదుటే ఉండిపోయారు. అనంతరం బోధన్ సబ్ రిజిస్ట్రార్ సాయినాథ్ భవన యజమాని శరత్‌తో అద్దె బకాయి విషయంపై చర్చించారు. 26లక్షల రూపాయల అద్దె బకాయి ఉందని యజమాని తెలుపగా ఉన్నతాధికారులకు వివరించి త్వరగా చెల్లించేలా చూస్తానని హామీ ఇచ్చారు. దీంతో సదరు యజమాని రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వేసిన తాళాన్ని తొలగించారు. దీంతో కొంత ఆలస్యంగా రిజిస్ట్రేషన్ పనులు ప్రారంభమయ్యాయి.

తెలంగాణ పోరాట యోధుల చరిత్రను చెరిపివేసే కుట్ర

- అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్

8

మోదీ నాయకత్వాన్ని ప్రపంచ దేశాలు కోరుకుంటున్నాయి



- మినహాయింపు ఇవ్వాలంటున్న ఉపాధ్యాయులు
- పాస్ అవ్వాల్సిందేనన్న సుప్రీంకోర్టు
- టెట్ అర్హత లేని టీచర్‌లలో మొదలైన ఆందోళన
- ఏళ్ల తరబడి ఉద్యోగాలు చేస్తున్న ఉపాధ్యాయులు
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల జోక్యానికి ఉపాధ్యాయ సంఘాల డిమాండ్

టెట్టా.. ఎట్టెట్టా!

ఉపాధ్యాయుల్లో 'టెట్' గుబులు

బోధన్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ఉపాధ్యాయుల్లో తీవ్ర ఆందోళనకు గురి చేస్తోంది. తమ ఉద్యోగాలు ఉంటాయా? ఊడుతాయా? అన్న సందేహలు, భయాలు వారిని వెంటాడుతున్నాయి. తమిళనాడుకు సంబంధించిన కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులో విద్యాహక్కు చట్టం ఆర్‌టీఈ అమల్లోకి వచ్చిన 2009 తర్వాత నియమితులైన ఉపాధ్యాయులు టెట్ (టీచర్ ఎలిజిబిలిటి టెస్ట్) ఉత్తీర్ణులు కావడం తప్పనిసరి అని పేర్కొంది. ఉపాధ్యాయులు పదోన్నతులు పొందాలన్న, టెట్ ఉత్తీర్ణత సాధించాల్సిందేనని స్పష్టం చేసింది. ఉద్యోగ విరమణకు ముందు ఐదేళ్లకు పైగా సర్వీస్ మిగిలి ఉన్న ఉపాధ్యాయులు ఉద్యోగాల్లో కొనసాగాలంటే మాత్రం టెట్ తప్పనిసరి పాస్ కావాల్సి ఉంటుందని తెలిపింది. ఐదేళ్లలోపు సర్వీస్ ఉన్న ఉపాధ్యాయులు మాత్రం టెట్ లేకుండానే సర్వీస్‌లో కొనసాగడానికి కోర్టు అనుమతులు ఇచ్చినట్లు పలు ఉపాధ్యాయ సంఘాల నేతలు చెప్పుతున్నారు. సుప్రీం కోర్టు తీర్పు పునఃసమీక్షించాలని పలు ఉపాధ్యాయ సంఘాలు విజ్ఞప్తి చేస్తున్నాయి. టీచర్లకు మినహాయింపు ఇవ్వాలని కోరుతున్నాయి.

2నుంచి 3వేల మంది టీచర్లపై ప్రభావం

ఐదేళ్లకు పైగా సర్వీస్ ఉన్న వారు టెట్ లేకుండా పదోన్నతులు పొందిన వారిలో ఇప్పుడు తీవ్ర ఆందోళన నెలకొంది. వీరంత ఇప్పుడు రెండేళ్లలో టెట్ పాస్ కావాల్సి ఉంటుంది. ఒక వేళ ఈ గడువు లోపు టెట్ పాస్ కాకుంటే ఉద్యోగం పోయినట్టేనా? అనే భయాలను టీచర్లు వ్యక్తం చేస్తున్నారు. కోర్టు తీర్పు వెలువరించిన దగ్గరుంచి చూస్తే వీరికి కౌంట్ డౌన్ స్టార్ట్ అయినట్టే కనిపిస్తుంది. జిల్లాలో దాదాపు 4800మంది వరకు టీచర్లు ఉన్నారు. వీరిలో సుమారు 2వేల నుంచి 3వేల మంది ఉపాధ్యాయులు టెట్ పాస్ కావాల్సిన వారు ఉంటారని అధికారిక వర్గాల అంచన. వీరిలో ఒక్కొక్కరు 15, 20, 25 ఏళ్లుగా సర్వీస్ చేస్తున్న వారు ఉన్నారు. అప్పుడెప్పుడో ఉద్యోగాలు పొందిన వీరంత ఇప్పుడు టెట్ రాసిన పాస్ అవుతారా అన్న అనుమానాలు ఉపాధ్యాయులను వెంటాడుతున్నాయి. ఓపికగా చదవాలి, సమయం కేటాయించాలి, ప్రస్తుతం ఉన్న పోటీని తట్టుకునే పరిస్థితి కొందరు ఉపాధ్యాయులకు ఉండవచ్చు., ఉండకపోవచ్చని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కేవలం రెండేళ్లలో టెట్ ఉత్తీర్ణులు కావడం భావ్యం కాదని

మిగతా 8వ పేజీలో...

సీనియర్లకు మినహాయింపు ఇవ్వాలి..

: పీఆర్‌టీయూ జిల్లా నాయకుడు శంకర్



సీనియర్ ఉపాధ్యాయులకు అలాగే 2009కి ముందు ఎస్‌జీటీగా ఉండి తర్వాత స్కూల్ అసిస్టెంట్ అయిన ఉపాధ్యాయులకు టెట్ మినహాయింపు ఇవ్వాలి. లేదా టెట్ క్వాలిఫైయింగ్ మార్క్ తగ్గించడం ద్వారా సమస్యకు పరిష్కారం చూపవచ్చు.

ఉపాధ్యాయులకు స్పెషల్ టెట్ నిర్వహించాలి..

: లలిత, ఉపాధ్యాయురాలు, బోధన్



ఉపాధ్యాయులకు స్పెషల్ టెట్ నిర్వహించడం ద్వారా కొంత వెసులుబాటు కలుగుతుంది. ప్రభుత్వం కూడా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై ఉపాధ్యాయ సంఘాలతో కలిసి రివ్యూ పిటిషన్ వేయడం ద్వారా ఉపయుక్తంగా ఉంటుంది.



మాట్లాడుతున్న భాస్కర్ రెడ్డి

బాజిరెడ్డి అరాచకాలు అందరికీ తెలుసు

- డీసీసీబీ మాజీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి

వర్ని, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): బాన్సువాడ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ 2004 నుంచి 2009 వరకు ఎన్నో అరాచకాలు చేసిన సంగతి నియోజక వర్గ ప్రజలు నేటికీ మర్చి పోలేరని డీసీసీబీ మాజీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి విమర్శించారు. గురువారం సిద్దాపూర్‌లో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రౌడీ రాజకీయాలతో నా సొంత కుటుంబంలో నా మేనమామ చంపిన వ్యక్తివి నువ్వు కాదా అని ప్రశ్నించారు. 2009లో మా నియోజక వర్గంలో ప్రజలు నిన్ను ఎందుకు బాన్సువాడ నుంచి పంపించారో మర్చి పోయారా అంటూ ప్రశ్నించారు. నిజామాబాద్ రూరల్ నియోజక వర్గంలోని ఉనికి పోయిందనే మళ్లీ బాన్సువాడ వైపు చూస్తున్నారని విమర్శించారు. ఈసారి కూడా బాన్సువాడలో నిన్ను నమ్మే పరిస్థితిలో ఎవ్వరూ లేరని మండిపడ్డారు.

మిగతా 8వ పేజీలో...



చింతకుంటలో పదో తరగతి విద్యార్థినులతో మాట్లాడుతున్న కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి

విద్యార్థులు ఏకాగ్రతతో ముందుకు సాగాలి

- కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి
- చింతకుంటలో పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

మోస్రా, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ ఎంతో కీలకమైనదని, ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని ఏకాగ్రతతో ముందుకు సాగితే ఉజ్వల భవిష్యత్తు సొంతమవుతుందని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి ఉద్బోధించారు. గురువారం ఆయన మండలంలోని చింతకుంట గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రైమరీ స్కూల్, అంగన్‌వాడీ సెంటర్‌లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పదో తరగతి క్లాస్ రూమ్‌ను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. జిల్లా పాలనాధికారిగా తన ప్రస్థానం గురించి తెలియజేస్తూ విద్యార్థుల్లో స్ఫూర్తిని పెంపొందించారు. విద్యార్థి దశలో కష్టపడితే మిగత జీవితమంత తమ కుటుంబంతో కలిసి హాయిగా గడపవచ్చని విద్యార్థులకు ప్రేరణ కల్పించారు. ప్రభుత్వం కేటాయించిన ఉచిత పాఠ్య పుస్తకాలు పంపిణీ అయ్యాయా, ఏకరూప దుస్తులను అందించారా అని ఆరా తీశారు. అంతకు ముందు కలెక్టర్ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రంలో మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా లేదా అన్నది గమనించి విద్యార్థుల కోసం వండిన ఆహార పదార్థాల నాణ్యతను స్వయంగా పరిశీలించారు. డైట్ ప్లాన్‌ను తప్పకుండా పాటించాలని ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మధుసూదన్‌ను ఆదేశించారు. కాగా ప్రైమరీ పాఠశాలలో బాలుర కోసం వెంటనే టాయిలెట్ నిర్మాణం చేపట్టేందుకు ప్రతిపాదనలు పంపాలని ఎంపీడీవో శ్రీనివాస్‌ను ఆదేశించారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ రాజశేఖర్, ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీవో వెంకటేశ్వర్లు, ఏపీవో అంబర్ సింగ్, గ్రామ పంచాయతీ కార్యదర్శి సౌమ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మధుసూదన్, స్థానిక అధికారులు పాల్గొన్నారు.

గంజాయి, జూదం, పీడీఎస్ రైస్

అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి

- పోక్సో, సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాలు
- నెలవారి సమీక్షలో పోలీసు కమిషనర్ సాయిచైతన్య



సమావేశానికి హాజరైన పోలీసు అధికారులు, మాట్లాడుతున్న పోలీసు కమిషనర్ (ఇన్‌సెట్‌లో)

సుభాష్‌నగర్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): అసాంఘిక కార్యక్రమాలు, గంజాయి, జూదం, పీడీఎస్ రైస్ అక్రమ రవాణా లాంటి వాటిపై ప్రత్యేక దృష్టి సారించి పటిష్ఠ చర్యలు తీసుకుంటున్నామని పోలీస్ కమిషనర్ సాయిచైతన్య అన్నారు. గురువారం జిల్లా పోలీస్ అధికారులతో నెలవారి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సాధ్యమైనంత త్వరగా పెండింగ్ కేసులను పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. పోక్సో, గ్రేవ్ కేసులలో త్వరితగతిన పరిశోధన పూర్తి చేయాలన్నారు. సైబర్ నేరాలపై ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకై ప్రత్యేక దృష్టి సారించి ప్రజల్లో రోడ్డు భద్రత నిబంధనలపై అవగాహన కల్పించాలన్నారు. గ్రామ పోలీసు అధికారులు ప్రతీరోజు గ్రామాన్ని సందర్శించి నేర నియంత్రణకు కృషి చేయాలన్నారు. గ్రామాల్లో సీసీ కెమెరాల ప్రాముఖ్యత, అవగాహన కల్పిస్తూ ఏర్పాటుకు కృషి చేయాలన్నారు. సైబర్ క్రైమ్, డయల్ 100 వాటి వినియోగంపై విద్యార్థులకు, ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఆన్‌లైన్ మోసాలకు గురైనట్లయితే 1930కు కాల్ చేసి ఎన్‌సీఆర్‌పీ పోర్టల్‌లో

మిగతా 8వ పేజీలో...

క్రైం సమాచారం

విద్యుత్ తీగలు తగిలి వ్యక్తి మృతి

బాన్సువాడ రూరల్, సెప్టెంబరు 18: మండలంలోని కోనాపూర్‌లో విషాద ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన కైసర్(60) గురువారం తెల్లవారుజామున మొక్కజొన్న పంటకు వేసిన విద్యుత్ తీగలకు తగిలి మృతిచెందాడు. కైసర్ ఈ నెల 16న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు గాలింపు చర్యలు చేపట్టారు. సంగోజీవాడి గ్రామ శివారులోని మొక్కజొన్న పంట మృతదేహం ఉందని స్థానికుల ద్వారా సమాచారం తెలియడంతో ఘటనాస్థలానికి వెళ్లి చూశారు. అక్కడ కైసర్ మృతిచెంది ఉన్నాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాన్సువాడ ఆసుపత్రికి తరలించారు. మృతుడి కుమారుడు అమీర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆరేపల్లిలో లిక్కర్ పట్టివేత

కామారెడ్డిటౌన్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): పాల్వంచ మండలంలోని ఆరేపల్లిలో హన్మండ్లు అనే వ్యక్తి ఇంట్లో 55 సీసాల మిలిటరీ లిక్కర్‌ను పట్టుకున్నట్లు కామారెడ్డి ఎక్సైజ్ ఎస్‌హెచ్‌వో విక్రమ్ తెలిపారు. 41.25 లీటర్ల లిక్కర్‌ను చట్టవిరుద్ధంగా కలిగి ఉన్నాడన్నారు. ఇలాంటి నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్, డిఫెన్స్ లిక్కర్ కలిగి ఉండడం లేదా అమ్మడం చట్టరీత్యానేరమని తెలిపారు. ఈ దాడుల్లో సీఐ సంపత్‌కృష్ణ, ఎస్‌ఐ శ్రీనివాస్, సిబ్బందిపాషా, రాజు, దేవాకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మట్కా నిర్వాహకురాలికి జైలు

ఆర్మూర్ టౌన్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): పట్టణంలో మట్కా నిర్వహిస్తున్న సునీతకు గురువారం సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ గట్టు గంగాధర్ 4 రోజుల జైలుశిక్ష విధించినట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ తెలిపారు. మార్చి 7న తెలిసిన సమాచారం మేరకు దాడులు నిర్వహించి మట్కా నిర్వహిస్తున్న సునీతను పట్టుకుని రిమాండ్‌కు తరలించారు. దీంతో న్యాయమూర్తి సునీతకు జైలుశిక్ష విధించారు.

ఆటోను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

ఎడపల్లి, సెప్టెంబరు18 (ఆంధ్రజ్యోతి): బోధన్-నిజామాబాద్ ప్రధాన రహదారిలో ఎమ్మెస్సీఫారం వద్ద గురువారం జరిగిన రోడ్డుప్రమాదంలో ఆటో బోల్తా పడింది. నిజామాబాద్ నుంచి బోధన్ వెళ్తున్న ఆర్టీసీ బస్సు ముందు నుంచి సిలిండర్ లోడ్‌తో వెళ్తున్న ఆటోను ఢీకొట్టింది. దీంతో ఆటో బోల్తాపడింది. ఆటోలో ఉన్న సిలిండర్‌లు చిందరవందరగా పడిపోయాయి. సిలిండర్‌లు పేలి ఉంటే పెద్ద ప్రమాదమే జరిగేదని, ఎలాంటి సంఘటన జరుగకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని బస్సును, ఆటోను పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

నగరంలో భారీ చోరీ

● 10 తులాల బంగారం, రూ.10 లక్షల నగదు మాయం

సుభాష్‌నగర్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): నగరంలోని 5వ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో భారీ చోరీ జరిగింది. ఇంట్లో ఎవరూలేని సమయంలో దొంగలు ఇంటి కిటికీగ్రిల్‌ను తొలగించి లోపలికి వెళ్లి దొంగతనానికి పాల్పడ్డారు. నగర శివారులోని బాబాసాహెబ్ పాడ్ ప్రాంతంలో నివాసముండే అఫ్రిన్ అనే మహిళ అర్సపల్లిలోని బంధువుల ఇంట్లో ఫంక్షన్‌కు వెళ్లింది. గురువారం ఉదయం ఇంటికి వచ్చేసరికి ఇంట్లోని బీరువా ధ్వంసం చేసి వస్తువులన్నీ చిందరవందరగా పడి ఉండటం గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చింది. ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు దొంగతనానికి పాల్పడిన ఆనవాళ్లను గుర్తించారు. బీరువాలో ఉన్న రూ.10 లక్షల విదేశీ కరెన్సీతో పాటు 10 తులాల బంగారం మాయమైనట్లు బాధితులు తెలిపారు. ఘటనాస్థలాన్ని సీసీఎస్ ఏసీపీ నాగేంద్రచారి పరిశీలించి, వివరాలను సేకరించారు. త్వరలో దొంగల ముఠాను పట్టుకుంటామని తెలిపారు. ఆయన వెంట 5వ టౌన్ ఎస్సై గంగాధర్, క్లూస్ టీమ్ ఉంది.

● కుర్నాపల్లిలోనూ దొంగతనం

ఎడపల్లి, సెప్టెంబరు18(ఆంధ్రజ్యోతి): కుర్నాపల్లిలో తాళం వేసిన ఇంట్లో దొంగతనం జరిగినట్లు ఎస్సై రమ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన తులసిగారి నరేందర్‌రెడ్డి తన భార్యతో కలిసి బుధవారం ఉదయం ఇంటికి తాళం వేసి తన అత్తగారి గ్రామమైన మెంట్రాజ్‌పల్లికి వెళ్లారు. అదేరోజు సాయంత్రం తన బంధువు ఫోన్ చేసి ఇంటి తలుపులు తెరిచి ఉన్నాయని చెప్పగా.. గ్రామానికి చేరుకుని ఇంటికి వెళ్లి చూసే సరికి ఇంటి తాళాలు పగులగొట్టి ఉన్నాయని, బీరువాలో నుండి బంగారు, వెండి అభరణాలు, నగదు మాయమైనట్లు గుర్తించారు. సుమారు రెండున్నర తులాల బంగారు, 15 తులాల వెండి ఆభరణాలు, రూ.30వేల నగదు దోచుకెళ్లినట్లు బాధితులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు. సంఘటనాస్థలానికి చేరుకున్న బోధన్ ఏసీపీ శ్రీనివాస్ దొంగతనం జరిగిన ఇంటిని పరిశీలించి డాగ్ స్క్వాడ్, క్లూస్ టీంను రప్పించి వివరాలను సేకరించారు. దొంగతనం చేసిన వారిని ఎట్టి పరిస్థితులలో పట్టుకుని తీరుతామని ఆయన హామీ ఇచ్చారు.

యువతి మృతదేహం లభ్యం

నిజాంసాగర్, సెప్టెంబరు18 (ఆంధ్రజ్యోతి): జక్కాపూర్ అటవీ ప్రాంతంలో యువతి మృతదేహాన్ని నిజాంసాగర్ పోలీసులు గురువారం కనుగొన్నారు. మెరూన్ కలర్ లెగ్గిన్, ఆకుపచ్చ టాప్‌పైన రెడ్ కలర్ ఫ్లవర్స్ దుస్తులను ధరించి ఉందని ఎస్‌ఐ శివకుమార్ తెలిపారు. రెండు కాళ్లకు పట్టీలు నడుముకు నలుపు రంగు మొలతాడు కుడి కాలుకు నలుపు రంగు దారం ధరించి ఉందన్నారు. 5 ఫీట్ల ఎత్తు ఉంటుందని, సమాచారం తెలిసినవారు 8712686172, 8712666221 నంబర్లను సంప్రదించాలన్నారు.

సాక్ష్యం చెప్పడానికి వచ్చి మృతి

నసురుల్లాబాద్, సెప్టెంబరు18 (ఆంధ్రజ్యోతి): తన కూతురి అత్యాచారం కేసులో సాక్ష్యం చెప్పడానికి వచ్చిన వ్యక్తి గురువారం కుప్పకూలి పడిపోయి వ్యక్తి చనిపోయిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. నాగర్‌కర్నూలు జిల్లా పెద్దకొత్తపల్లి మండలం నడిబాగుతండాకి చెందిన బెజానాయక్ కొన్నేళ్లుగా అంకోల్‌క్యాంపులో నివాసం ఉంటున్నారు. ఇక్కడి నుంచి తమ స్వగ్రామానికి వెళ్లిన వారు కూతురిపై అత్యాచారం కేసు ఉండటంతో కోర్టులో సాక్ష్యం చెప్పడానికి పోలీసులు రమ్మనడంతో బుధవారం వచ్చారు. గురువారం ఆరోగ్యం బాగా లేకపోవడంతో అంకోల్‌లో రోడ్డుపై కుప్పకూలి చనిపోయాడని అతడి భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేసున్నారు.

రైలు కిందపడి ఆత్మహత్య

ఇందూరు, సెప్టెంబరు18(ఆంధ్రజ్యోతి): జీవితంపై విరక్తితో యువకుడు రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. నిజామాబాద్ రైల్వే ఎస్సై సాయిరెడ్డి కథనం ప్రకారం.. అర్సపల్లికి చెందిన మహేష్ కొన్నిరోజులుగా మద్యానికి బానిసయ్యాడు. తాగుడు మానాలని భార్య మందలించడంతో జీవితంపై విరక్తితో నిజామాబాద్ - జాన్కంపేట్ రైల్వేస్టేషన్ ప్రాంతంలో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల ద్వారా వివరాలు సేకరించిన రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసున్నారు.

ఉరేసుకుని మరొకరు..

ఎల్లారెడ్డిరూరల్, సెప్టెంబరు18(ఆంధ్రజ్యోతి):ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఎల్లారెడ్డి మండలంలో చోటుచేసుకుంది. కళ్యాణీ గ్రామానికి చెందిన బండారి సాయిలు మేస్త్రీ పనిచేసేవాడు. అతడి మొదటి భార్య పదేళ్ల కిందట మరణించగా.. 2వ పెళ్లి చేసుకున్నాడు. సాయిలు మద్యానికి బానిసై, సక్రమంగా పనిచేయకుండా తిరుగుతుండేవాడు. జీవితంపై విరక్తి చెంది కళ్యాణీ-కొక్కోండ మార్గంలో చెట్టుకు ఉరేసుకున్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి తండ్రి సాయిలు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ముగ్గురి బైండోవర్

ఇందల్వాయి,సెప్టెంబరు18(ఆంధ్రజ్యోతి): తహసీల్దార్ వెంకట్రావ్ ఎదుట గుడుంబా తయారు చేస్తున్న ముగ్గురిని గురువారం బైండోవర్ చేసినట్లు ఎక్సైజ్ పోలీసులు తెలిపారు. మేగ్యానాయక్‌తండా, గండితండా, త్రియంబక్ పేట్, దేవుని తండాలో గుడుంబా కాస్తున్న ముగ్గురిని ఎక్సైజ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 8.5 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకొని, తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు.

రూ.కోట్లు విలువైన భూమి కబ్జా

ధర్మరాయుడి కుంట శిఖంపై రియల్టర్ల కన్ను

భీమ్‌గల్ రూరల్, సెప్టెంబరు, 18 (ఆంధ్రజ్యోతి): భీమ్‌గల్ మున్సిపల్‌గా ఏర్పడినప్పటి నుంచి భూముల ధరలకు లెక్కలొచ్చాయి. భూమి గజానికి రూ.వేల నుంచి లక్ష పలుకుతోంది.సామాన్యులు ప్లాటు కొనుక్కొని ఇళ్లు నిర్మించుకోవాలనే ఆశ కళగానే మిగిలిపోతుంది. రియల్ ఎస్టేట్ మాఫియా కన్ను ప్రభుత్వ, అసైన్డ్, శిఖం, ఇనాం, రిజర్వు ఫారెస్ట్ భూములపై పడింది. మున్సిపల్ నడిబొడ్డున ఉన్న ధర్మరాయుడి కుంటను ఈగల కుంట అని కూడా అంటారు. ఈ కుంట సర్వే నెంబర్ 426లో ఐదు ఎకరాల ముప్పై ఎనిమిది గుంటల భూమి ఉంది. దీని పక్కన 423, 424, 425 సర్వే నెంబర్లలో పట్టా భూమి ఉంటుంది. ఈసర్వే నెంబర్లలో రియల్ వ్యాపారులు తక్కువ ధరకు భూమి కొనుగోలు చేసి 426 సర్వే నెంబర్‌లో ఉన్న ధర్మరాయుడి కుంట శిఖం భూమిని కబ్జా చేసి ప్లాట్లు పెట్టి అమ్ము కున్నారు. అక్కడ ఉన్న భూమిలో రైతులు పం డించిన వడ్లను ఆరబోస్తున్నారు. సొసైటీ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రం నిర్వహి స్తున్నారు. భీమ్‌గల్‌కు కోర్టు మంజూరైంది. కోర్టు నిర్మాణం కోసం ప్రభుత్వ భూమి లేకపో వడంతో వాపస్ పోయే పరిస్థితి ఏర్పడిందని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. కుంట శిఖం భూమిని రెవెన్యూ అధికారులు సర్వే చేసి కబ్జాకు గురైన భూమిని స్వాధీనం చేసుకుని, కోర్టు భవన నిర్మాణానికి కేటాయించాలని ప్రజలు కోరుతున్నారు.



కబ్జాకు గురవుతున్న ధర్మరాయుడి కుంట

మహిళలందరికీ ఆరోగ్య పరీక్షలు



సమావేశంలో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్

బోధన్,సెప్టెంబరు18(ఆంధ్రజ్యోతి): స్వస్థ్‌నారీ.. స్వశక్త్‌పరివార్ అభియాన్‌లో ప్రతి మహిళకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించేలా చర్యలు చేపట్టామని బోధన్ సబ్‌కలెక్టర్ వికాస్ మహతో అన్నారు. గురువారం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అక్టోబర్ 2వరకు వైద్య శిబిరాలు కొనసాగేలా ప్రణాళికలు రూపొందించామన్నారు. మహిళల ఆరోగ్య సంరక్షణే ధ్యేయంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన ఈ పథకంలో భాగంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, అర్బన్ హెల్త్ సెంటర్‌ల ఆధ్వర్యంలో క్యాంపులు కొనసాగుతాయన్నారు. సిబ్బంది వైద్యశిబిరాలు విజయవంతంచేయాలని పిలుపునిచ్చారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం



మాట్లాడుతున్న ఏఐయూకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వి.ప్రభాకర్

ఆర్మూర్‌టౌన్,సెప్టెంబరు,18(ఆంధ్రజ్యోతి): యూరియా కొరతపై రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేపడుతామని ఏఐయూకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వి. ప్రభాకర్ అన్నారు. గురువారం పట్టణంలో జరిగిన సంఘం జిల్లాకార్యవర్గ సమావేశాలకు ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. కేంద్రం దేశవ్యాప్తంగా యూరియా సరఫరాలో విఫలమైందన్నారు. కేంద్రంపై రాష్ట్రప్రభుత్వం ఒత్తిడి తీసుకురావడం లేదని, రెండు ప్రభుత్వాలు రైతుల జీవితాలతో ఆడుకుంటున్నాయని మండిపడ్డారు. మోదీ రైతుల నోట్లో మట్టికొట్టడానికి పత్తిదిగుమతిపై 11శాతం సుంకాలు తగ్గించాడన్నారు. జిలాలో జరిగే ఆందోళనలో రైతులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్రకార్యదర్శి దేవరాం, జిల్లా దృక్షుడు సురేష్, బాబన్న, కిషన్, రాజన్న, గంగారాం తదితరులు పాల్గొన్నారు.

ఖేలో ఇండియా పోటీల్లో 6 పతకాలు

బోధన్,సెప్టెంబరు18(ఆంధ్రజ్యోతి): బోధన్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళశాల విద్యార్థులు వరంగల్‌లో జరిగిన ఖేలో ఇండియా క్రీడల్లో కిక్ బాక్సింగ్ విభాగంలో ఆరు పతకాలు సాధించారని ప్రిన్సిపల్ సురేష్‌కుమార్ తెలిపారు. బి.మాయవతి, ఓమేజా బేగం బంగార, షేక్ షహీన్, సయ్యద్ ఆస్మా బేగం సిల్వర్, బిందు, సుప్రిత కాంస్య పతకాలు సాధించారన్నారు. క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి పతాకాలు సాధించిన విద్యార్థులను గురువారం ప్రిన్సిపల్ సురేష్‌కుమార్, వైస్ ప్రిన్సిపల్ సత్యవరప్రసాద్, అధ్యాపకులు రాజు, బాబురావు, కోచ్ శ్రీనివాస్ అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్, అధ్యాపకులు

డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల బిల్లులు ఇప్పించాలి



కోటగిరి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా

కోటగిరి,సెప్టెంబరు18(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయంలో డబుల్ బెడ్ రూమ్ పథకం కింద ఇళ్లు నిర్మించుకున్న 26మంది లబ్ధిదారులు బిల్లులు రాకపోవడంతో ఆందోళనకు దిగారు. కోటగిరి తహసీల్దార్ కార్యాలయం ఎదుట గురువారం ధర్నా నిర్వహించారు. ఇళ్లు కట్టుకొని రెండేళ్లయినా బిల్లులు చెల్లించకపోవడంతో తెచ్చిన అప్పులకు వడ్డీలు పెరిగిపోయి ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. గృహ నిర్మాణ శాఖ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదుచేసినా పట్టించుకోవడం లేదని వాపోయారు. కొన్నిబిల్లులు వచ్చాయని, వాటిని ఎవరెవరికి ఇచ్చారో తెలియడం లేదన్నారు. అధికారులు స్పందించి, తమ బిల్లులు చెల్లించాలని డిమాండ్‌చేశారు.

ప్రభుత్వ భూమి కబ్జాను అరికట్టాలి



పోతంగల్‌లో రాస్తారోకో చేస్తున్న దృశ్యం

కోటగిరి,సెప్టెంబరు18(ఆంధ్రజ్యోతి): పోతంగల్‌లో 171 సర్వే నెంబర్‌లోని ప్రభుత్వభూమిని కబ్జా నుంచి కాపాడాలని బాధితులు డిమాండ్‌చేశారు. పోతంగల్, కోటగిరి రహదారిపై గురువారం వారు రాస్తారోకో నిర్వహించారు. గతంలో ఇళ్లస్థలాలు లేనివారికి భూమి కేటాయించారని, తమకు స్థోమత లేక ఇళ్లు కట్టుకోలేదన్నారు. గతంలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పథకం కింద ఇళ్లను నిర్మిస్తామని హామీ ఇచ్చారని, తమ స్థలాన్ని కబ్జాచేస్తున్నారని ఆరోపించారు. రాస్తారోకో విషయం తెలుసుకున్న ఆర్‌ఐ సయ్యద్‌హుస్సేన్‌ను అక్కడికి వెళ్లి బాధితులతో మాట్లాడారు. తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదుచేస్తే, విచారణ జరిపిచర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో వారు శాంతించారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

రెంజల్,సెప్టెంబరు18(ఆంధ్రజ్యోతి): రెంజల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్న డాక్టర్ షహీస్తా ఫిర్దోస్ తెలిపారు. స్వస్థ్ నారీ.. స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఆరోగ్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఆరోగ్య శిబిరానికి ప్రముఖ స్త్రీ వైద్య నిపుణులు డాక్టర్ రమ్య, జనరల్ ఫిజిషియన్ డాక్టర్ శ్రీకాంత్, డెంటిస్ట్ నీలిమా వస్తున్నట్లు తెలిపారు. ఉదయం 9గంటల నుండి చికిత్స చేయించుకోవాలని, ప్రతి ఒక్కరు ఆధార్ కార్డులు తీసుకురావాలని అన్నారు.

విధుల్లో చేరిన జీపీవోలు

ఏర్గట్ల, సెప్టెంబరు18 (ఆంధ్రజ్యోతి): మండలంలో గ్రామపాలన అధికారులు బాధ్యతలు చేపట్టినట్లు తహసీల్దార్ మల్లయ్య తెలిపారు. గుమ్మిర్యాల్, దోంచందకు గంగాధర్, తాళ్లరాంపూర్‌లో మధు, తొర్తిలో భూమన్న, ఏర్గట్లకు వెంకటేష్‌గౌడ్‌ను నియమించినట్లు చెప్పారు. ప్రజలకు అవసరమైన పత్రాలు జీపీవోలధ్రువీకరణ తర్వాతే తహసీల్దార్ కార్యాలయంలో ఇస్తామన్నారు.

డిగ్రీ కాలేజీలో కార్యశాల

ఆర్మూర్‌టౌన్,సెప్టెంబరు,18(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చరిత్ర విభాగం, ఇతిహాస సంకలన సమితి తెలంగాణ ఆధ్వర్యంలో కార్యశాల నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపల్ వేణుగోపాలస్వామి తెలిపారు. విద్యార్థులు చరిత్రపట్ల ఆసక్తితో ఉండాలని, ప్రతీఒక్కరు వారి గ్రామాల చరిత్రను తెలుసుకోవాలని ముఖ్యఅతిథి డాక్టర్ జై కిషన్ సూచించారు. ఐరన్ వుడ్స్ ఇండస్ట్రీ ఇన్ ఇందూరు, సోర్స్ ఆఫ్ అన్సియంట్ ఇండియన్ హిస్టరీ అనే అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వీరేందర్, నరేష్‌కుమార్, మురళి, దేవన్న, వెంకటేశ్వర్లు, సునీత, జాన్ సుకుమార్, అంబర్ సింగ్, సన ఫిర్దోస్ తదితరులు పాల్గొన్నారు.

108లో ప్రసవం

బోధన్,సెప్టెంబరు18(ఆంధ్రజ్యోతి): కల్దుర్కికి చెందిన లావణ్య పురిటినొప్పులతో బాధపడుతుండగా 108లో బోధన్ ఆసుపత్రికి తరలించే క్రమంలో అంబులెన్స్ ప్రసవించింది. అంబులెన్స్ సిబ్బంది మార్గమధ్యలో వాహనాన్ని ఆపి మహిళకు సుఖ ప్రసవం చేశారు. దీంతో ఆమె పండంటి బిడ్డకు జన్మనిచ్చింది. మహిళతో పాటు చిన్నారిని ఆసుపత్రికి తరలించారు. తల్లిబిడ్డ క్షేమంగా ఉండడంతో కుటుంబ సభ్యులు 108 సిబ్బంది శివ, దినేష్, ఆశా వర్కర్ సునీతను అభినందించారు.

నిందితులను అరెస్టు చేయాలి

మోర్తాడ్, సెప్టెంబరు,18 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో గురువారం జర్నలిస్టులు రాస్తారోకో చేశారు. ఏర్గట్ల మండలం తాళ్లరాంపూర్ గౌడ్‌లపై గ్రామస్థులు దాడి చేసిన విషయంలో ఒక విలేకరి వార్త సేకరణ కోసం వెళ్లగా అతడిపై దాడి చేశారని వారిని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎస్సైలకు వినతి పత్రం అందజేశారు.

నిమిషాంబదేవికి కానుకలు

ముప్కాల్, సెప్టెంబరు 18, (ఆంధ్రజ్యోతి): బాల్కొండలో పురాతనమైన నిమిషాంబ దేవి ఆలయానికి బంగారు పుస్తె, 11తులాల వెండిని బాల్కొండకు చెందిన బ్రాహ్మం రౌతు పావణి, నిర్మల్‌కు చెందిన ప్రశాంత్, కీర్తి కుటుంబ సభ్యులు అందజేశారు. వారిని అమ్మవారు ఆయురారోగ్యాలతో ఉండేలా చూడాలని వేడుకున్నారు.

క్రీడా దుస్తుల అందజేత

జక్రాన్‌పల్లి , సెప్టెంబరు18(ఆంధ్రజ్యోతి): మునిపల్లిలో విద్యార్థులకు క్రీడా దుస్తులను ఐసీడీఎంఎస్ మాజీ చైర్మన్ సాయిరెడ్డి అందజేశారు. ముస్కు బొర్రన్న జ్ఞాపకార్థం, ఎంబీఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో 40మందికి, తొర్లికొండలో దాత జెస్సు వినోద్, ఎంఈవో 20 మంది విద్యార్థులకు క్రీడా దుస్తులను అందజేశారు. కార్యక్రమంలో మునిపల్లి మాజీ సర్పంచ్ చిన్న సాయిరెడ్డి, తొర్లికొండ పీఈటీ గంగామోహన్ పాల్గొన్నారు.

సత్తా చాటిన శసున్

ఆర్మూర్, సెప్టెంబరు,18 (ఆంధ్రజ్యోతి): శ్రీభాషిత హైస్కూల్ విద్యార్థి శసున్ అండర్17 ఇంటర్ స్టేట్ క్రికెట్ ఛాంపియన్‌షిప్‌లో ప్రతిభ కనబర్చినట్లు కరస్పాండెంట్ సుందర్ తెలిపారు. తిరుపతిలోని వైఎస్ఆర్ క్రికెట్ గ్రౌండ్‌లో నిర్వహించిన పోటీల్లో ప్రతిభను కనబర్చి అందరి మెప్పు పొందినట్లు ఆయన చెప్పారు. ప్రతిభ చూపిన విద్యార్థిని కరస్పాండెంట్ అభినందించారు.

అపార్ట్‌మెంట్‌పై చర్యలు తీసుకోవాలి

ఆర్మూర్ టౌన్ , సెప్టెంబరు, 18(ఆంధ్రజ్యోతి): పెర్కిట్ శివారులో ఫైర్ సేఫ్టీ లేని అపార్ట్‌మెంట్‌పై చర్యలు తీసుకోవాలని సొసైటీ వైస్ చైర్మన్ నర్మె నవీన్, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు పూజనరేందర్ మున్సిపల్ కమిషనర్ రాజుకు వినతిపత్రం అందజేశారు. అపార్ట్‌మెంట్ పూర్తిగా అక్రమ కట్టడమని, నిర్మాణానికి ఉండాల్సిన సౌకర్యాలు లేకుండా ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతోందన్నారు. ప్రమాదం జరుగకముందే సీజ్ చేయాలని కోరారు.

మారథాన్ అంబాసిడర్‌గా వేల్పూర్ వాసి

వేల్పూర్, సెప్టెంబరు, 18(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అమరావతిలో ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న స్వచ్ఛతాన్ ఆఫ్ మారథాన్‌కు తెలంగాణ నుంచి గుగ్గిలం అశోక్ బ్రాండ్ అబాసిడర్‌గా ఎంపికయ్యారు. వేల్పూర్ గ్రామానికి చెందిన అశోక్ పలు జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో పాల్గొని, ఎన్నో విజయాలను సాధించాడు. ఆంధ్రప్రదేశ్ బ్రాండ్ అంబాసిడర్‌గా ఎంపిక కావడం తనకు సంతోషంగా ఉందని అశోక్ అన్నారు. అశోక్ ఎంపిక పట్ల వేల్పూర్ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

రుద్రూర్‌లో వైద్య శిబిరం

రుద్రూరు,సెప్టెంబరు18(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో స్వస్థ్ నారీ.. స్వశక్తి పరివార్ అభియాన్‌లో భాగంగా గురువారం వైద్యశిబిరాన్ని నిర్వహించారు. పిల్లల వైద్యుడు విఘ్నేష్ చిన్నారులకు పరీక్షలు చేశారు. శ్వాసకోశ నిపుణుడు, జనరల్ ఫిజిషియన్ శ్రీకాంత్ పరీక్షలు నిర్వహించారు. ఈ వైద్య శిబిరాన్ని జిల్లా ప్రోగ్రాం అధికారి డా.వెంకట్, డీపీవో విశాల పర్యవేక్షించారు. ఈ వైద్య శిబిరంలో 96మంది పిల్లలు, 13మందికి జనరల్ పల్మనాలజీ వైద్యులు, 26మందికి జనరల్ ఫిజీషియన్ వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ అయేషా సిద్దికీ, సూపర్‌వైజర్ రవి, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రవేత్తల పర్యటన

ఏర్గట్ల, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దోంచందలో గురువారం రుద్రూర్ చెరుకు, వరి పరిశోధన స్థానం శాస్త్రవేత్తల బృందం పర్యటించింది. గ్రామానికి చెందిన కొరిపెల్లి లింగారెడ్డి ఆర్‌డీఆర్ 1200రకం వరిక్షేత్రాన్ని పరిశీలించి, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు సమతా పరమేశ్వరి, రాకేష్, కృష్ణచైతన్య, ఏవో వైష్ణవ్, ఏఈవోలు సాయి, సచిన్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

చెక్కుల పంపిణీ

మోర్తాడ్, సెప్టెంబరు, 18(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని గ్రామ పంచాయితీ ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు రెండవ విడుత మంజూరైన చెక్కులను కాంగ్రెస్ నాయకులు అందజేశారు. మోర్తాడ్‌లోని 15 మంది లబ్ధిదారులకు రెండవ సారి చెక్కులు మంజూరయ్యాయని వారు తెలిపారు. ఈ సందర్బంగా లబ్ధిదారులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ బాల్కొండ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ ముత్యాల సునీల్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు పుప్పాల అశోక్, కార్యదర్శి సైఫ్ ఉద్దీన్, ఇందిరమ్మ కమిటి సభ్యులు, నాయకులు నాగభూషణం, తదితరులు పాల్గొన్నారు.

క్రీడలకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి

జక్రాన్‌పల్లి , సెప్టెంబరు, 18(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో విద్యతో పాటు క్రీడలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని పడకల్‌లో జడ్పీహెచ్ఎస్‌లో మండల స్థాయి అంతర్ పాఠశాలల క్రీడలను ఎమ్మెల్యే ప్రారంభించారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో పాల్గొని మంచి నైపుణ్యాన్ని ప్రదర్శించి ప్రతిభ కనబర్చి రాష్ట్ర, జాతీయస్థాయిలో రాణించాలన్నారు. భవిష్యత్తులో ఉన్నతస్థాయికి ఎదిగి తల్లిదండ్రులకు పేరు తేవాలన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల పథకం కింద పాఠశాలో విద్యార్థులకు సౌకర్యాలు కల్పించామన్నారు. పడకల్‌లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తరగతుల గదుల కొరత ఉందని క్రీడల కన్వీనర్, ప్రధానోపాధ్యాయుడు సురేందర్‌రెడ్డి ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా.. నిధుల మంజూరుకు సీఎంతో మాట్లాడతానన్నారు. పడకల్, కేశ్‌పల్లి పెద్ద చెరువు కట్ట గత రెండేళ్ల క్రితం తెగిపోగా ఆ చెరువును, అలుగును ఎమ్మెల్యే పరిశీలించారు. మరమ్మతులకు నిధులు మంజూరు చేయిస్తానన్నారు. ఆయా కార్యక్రమాల్లో డీఈవో అశోక్, ఐడీసీఎంఎస్ మాజీ చైర్మన్ సాయిరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చిన్నారెడ్డి, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, క్రీడల కన్వీనర్, హెచ్ఎం సురేందర్‌రెడ్డి, ఎంఈవో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ

మండలంలోని గ్రామాలకు చెందిన 23మంది లబ్దిదారులకు గురువారం కళ్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే భూపతిరెడ్డి పంపిణీ చేశారు. రాష్ట్రంలో యూరియా కొరతకు కేంద్ర ప్రభుత్వమే కారణమన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ కుమ్మక్కై ప్రజలను, రైతులను తప్పుదోవ పట్టిస్తున్నాయన్నారు. ఆ పార్టీల నాయకులు చెప్పే మాటలను ప్రజలు నమ్మవద్దన్నారు. మహిళలను అభివృద్ధి చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు.

కార్యకర్తలు సమన్వయంతో పని చేయాలి



నాయకులతో సమావేశమైన మానాల మోహన్‌రెడ్డి

నవీపేట,సెప్టెంబరు18(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ కార్యకర్తలు సమన్వయంతో పని చేయాలని జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి కోరారు. గురువారం పార్టీ మండల సీనియర్ నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. స్థానిక సంస్థల ఎన్నికలలో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, నాయకులు రాజేందర్‌గౌడ్, గోవర్ధన్‌రెడ్డి, సాయిరెడ్డి, భగవాన్, బాబు, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



మాట్లాడుతున్న సివిల్ జడ్జి ఉదయ్ భాస్కర్

ఆర్మూర్, సెప్టెంబరు, 18(ఆంధ్రజ్యోతి): ప్రతీఒక్కరికి చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయసేవాసంస్థ కార్యదర్శి , సివిల్ జడ్జి ఉదయ్ భాస్కర్ అన్నారు. ఆర్మూర్ మండలం పిప్రిలో గురువారం మండల లీగల్ సర్వీస్ కమిటీ ఆధ్వర్యంలో న్యాయ చైతన్య సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సివిల్ జడ్జి ఉదయ్ భాస్కర్ మాట్లాడుతూ.. గ్రామాభివృద్ధి కమిటీలు చట్టాలను చేతుల్లోకి తీసుకోవద్దన్నారు. గ్రామాలలో అరచకాలు, కుల బహిష్కరణలు చేపట్టవద్దని, వివాదాలకు తావివ్వకుండా చూడాలన్నారు. ప్రజలకు న్యాయవ్యవస్థపై అవగాహన కల్పించారు. ఏదైన సమస్య ఏర్పడితే జిల్లా న్యాయ సేవా సంస్థను సంప్రదిస్తే ఉచిత న్యాయసాయం అందజేస్తారన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు బాస రాజేశ్వర్, బాలాజీ, గంట సదానందం, జీపీ కార్యదర్శి మురళికాంత్, గ్రామస్థులు పాల్గొన్నారు.

స్పందించి.. పూడిక తీయించి



ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

డొంకేశ్వర్, సెప్టెంబరు18(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని 3వ వార్డులో 'ముందుకు వెళ్లని మురుగు' అనే శీర్షికతో ఆంధ్రజ్యోతిలో ఈనెల 15న వచ్చిన కథనానికి పంచాయతీ కార్యదర్శి శేఖర్ గౌడ్ స్పందించారు. జెసిబి సహాయంతో మురుగు కాలువను పూడిక తీయించారు. చుట్టూ ఉన్న చెత్తాచెదారం తీసివేయించారు. చెట్ల కొమ్మలను తొలగించారు. ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనంతో గత కొన్ని ఏళ్లుగా ఉన్న సమస్యకు పరిష్కారం లభించిందని కాలనీ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

సూర్యఘర్ యోజనను వినియోగించుకోవాలి



అవగాహన కల్పిస్తున్న ఎంపీవో శివచరణ్

ఏర్గట్ల, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి సూర్యఘర్ యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీవో శివచరణ్ తెలిపారు. గరువారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో సోలార్ పథకంపై అవగాహన కల్పించారు. ఈ పథకం ద్వారా ఇళ్ల పైకప్పులపై సౌర ఫలకాలు ఏర్పాటు చేసుకొని 2 కిలో వాట్ల సామర్థ్యానికి 60 శాతం, అంతకు పైబడిన యూనిట్లకు 40 శాతం మొత్తాన్ని రాయితీ కింద అందిస్తారని తెలిపారు. 3కిలోవాట్ల ఏర్పాటుకై రూ.1,45,000 ఖర్చు కాగా రూ.78వేలు రాయితీగా పొంద వచ్చన్నారు. మొదటిసారిగా ఉత్పత్తి అయ్యే విద్యుత్‌లో తొలి 300 యూనిట్లు ఉచితంగా అందిచనున్నట్లు తెలిపారు. మండల ప్రత్యేకాధికారి శివకృష్ణ, కార్యదర్శి జాకీర్ హుస్సేన్, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లిలో ప్రపంచ వెదురు దినోత్సవం



వెదురు మొక్కలు పంపిణీ చేస్తున్న సభ్యులు

కమ్మర్‌పల్లి, సెప్టెంబరు 18: (ఆంధ్రజ్యోతి): ప్రపంచ వెదురు దినోత్సవాన్ని కమ్మర్‌పల్లి మండల(మహేంద్ర) మ్యాదరి సంఘం సభ్యులు గురువారం ఘనంగా నిర్వహించారు. తమకు ఉపాధినిచ్చే వెదురు తయారీ వస్తువులు, పనిముట్లకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్థానిక అటవీప్రాంతంలో వెదురు మొక్కలు నాటారు. తమవృత్తికి జీవనాధారమై వెదురు ఎప్పుడు గౌరవప్రదమైన స్థానాన్ని కల్పిస్తుందని మండల మహిళ అధ్యక్షురాలు విజయభారతి పేర్కొన్నారు. పూర్వీకుల నుంచి వారసతాన్ని కొనసాగిస్తున్నామని నూతన తరాలకు స్ఫూర్తినిచ్చేలా ఐక్యమత్యంగా ఉంటూ.. హక్కుల కోసం ఐక్యంగా పోరాడి సాధించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో శ్రీనివాస్, రవి, వీణ, శంకర్, కళావతి, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

పంటలను పరిశీలించిన వ్యవసాయ శాస్త్రవేత్తలు


పసుపు పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

ఆర్మూర్, సెప్టెంబరు, 18(ఆంధ్రజ్యోతి): పట్టణంతో పాటు పలు గ్రామాల్లో గురువారం వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు పంట పొలాలను పరిశీలించారు. క్వాలిటి సీడ్ విలేజ్ ప్రోగ్రాంలో భాగంగా రైతులకు సరఫరా చేసిన మిని కిట్, ఆర్డిఆర్ 1200 వరి వంగడాల పంట పొలాలు, మొక్కజొన్న, పసుపు పంటలను వారు పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు రాకేష్, సాయిచరణ్, ఏవో హరికృష్ణ, ఏఈవో అనూష, రైతులు దొడ్ల నారాయణ, శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రహదారి రంగుల మయం

పెద్దకొడప్‌గల్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): జుక్కల్ నియోజక వర్గం గుండా 161వ జాతీయ రహదారి సాగుతోంది. ఈ రహదారి నిజాంసాగర్ మండలం నుంచి మొదలై మద్నూర్ మండలం వరకు 75 కిలోమీటర్ల మేర వ్యాపించి ఉంది. గత కొన్నాళ్ళ కిందట ప్రారంభమైన ఈ రహదారిపై నిత్యం వందల సంఖ్యలో వాహ నదారులు రాకపోకలు సాగిస్తుంటారు. నాలుగు వరుసల ఈ రహదారి రెండు వరుసలు ఒక వైపు, మరో రెండు వరసలు ఇంకో వైపు ఉంటాయి. రహదారి మధ్య భాగంలో రహదారిని నిర్మించే సమయంలో హైవే అధికారులు పూల మొక్కలు నాటించారు. వాహనదారులకు ప్రయాణంలో అలుపురాకుండ ఉండేందుకు అధికారులు అందమైన పూలమొక్కలు నాటించారు. ప్రస్తుతం ఈ మొక్కలు అందమైన పచ్చని పూలు పూయడంతో దారంతా రంగులమయంగా మారిందని వాహనదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.


రహదారిపై కనువిందు చేస్తున్న పచ్చని పూల వనం

వాల్‌పోస్టర్లను ఆవిష్కరించిన డీఎస్పీ


వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డీఎస్పీ విఠల్‌రెడ్డి

బాన్సువాడటౌన్ , సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌కు సంభందించిన వాల్‌పోస్టర్లను గురువారం బాన్సువాడ డీఎస్పీ విఠల్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ క్రీడాకారుల నైపుణ్యతను వెలికితీసేందుకు గ్రామీణ క్రీడలు దోహదపడతాయి. ఈ నెల 28, 29, 30 తేదీల్లో బోర్లం క్యాంపుతాండాలో నిర్వహించబోయే జిల్లా స్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌లో యువత పాల్గొని తమ సత్తా చాటాలన్నారు. ఈ కార్యక్రమంలో టోర్నమెంట్ నిర్వాహకులున్నారు.

ఆర్టీసీ బస్టాండ్‌లో స్వచ్ఛభారత్


బాన్సువాడ బస్టాండ్‌లో స్వచ్ఛభారత్ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

బాన్సువాడటౌన్ , సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): బాన్సువాడ ఆర్టీసీ బస్టాండ్‌లో గురువారం బీజేపీ నాయకులు స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు నీలం చిన్నరాజులు బస్టాండ్ పరిసరాల్లోని చెత్తా చెదారాన్ని తొలగించారు. బ్లీచింగ్ పౌడర్‌వేసి నీటితో బస్టాండ్‌ను శుభ్రం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణాధ్యక్షుడు కోనాల గంగారెడ్డి , జిల్లా ఉపాధ్యక్షుడు లక్ష్మీనారాయణ, జిల్లా కార్యదర్శి శంకర్‌గౌడ్ , మోహన్‌రెడ్డి , శ్రీనివాస్‌రెడ్డి తదితరులున్నారు.

భవిత భవన్‌లో ఫిజియోథెరపీ శిబిరం



చిన్నారులకు ఫిజియోథెరపీ నిర్వహిస్తున్న దృశ్యం

బాన్సువాడటౌన్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): బాన్సువాడ పట్టణంలోని భవిత భవన్ సెంటర్లో గురువారం ఫిజియోథెరపీ క్యాంపును నిర్వహించారు. వైద్యులు గంగాధర్ దివ్యాంగ చిన్నారులకు ఫిజియోథెరపీ చికిత్సలు చేశారు. ఈ కార్యక్రమంలో వెంకటపద్మ, అనిల్ తదితరులున్నారు.

మైలారం గ్రామంలో నీటి సమస్యను పరిష్కరించండి

- గ్రామం వైపు కన్నెత్తి చూడని ప్రత్యేక అధికారి
- మంచినీటి కోసం రోడ్డు ఎక్కిన మహిళలు


మైలారంలో తాగునీటి కోసం రోడ్డు ఎక్కిన మహిళలు

నసురుల్లాబాద్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): నసురుల్లాబాద్ మండలంలోని మైలారం గ్రామంలో గురువారం గ్రామస్థులు, మహిళలు ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. గత ఐదు రోజుల నుంచి గ్రామంలో నీటి సమస్య తీవ్రంగా ఉందని గ్రామస్థులు వాపోతున్నారు. మిషన్ భగీరథ నీరు బురద నీరు వస్తుందని తాగడానికి, వాడడానికి నిరుపయోగంగా మారిందని అన్నారు. బోర్లు గ్రామంలో ఉన్నప్పటికీ వాటిని మరమతులు చేయకుండా అధికారులు ప్రజలను ఇబ్బంది పెడుతున్నారని వాపోయారు. గ్రామంలో వీధిదీపాలు వెలగడం లేదని, పారిశుధ్యం, చెత్త తొలగించడం లేదని అన్నారు. ఈ సమస్యపై గ్రామ ప్రత్యేక అధికారి పై ఎంపీడీవోకి ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని, గ్రామస్థులు అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. గ్రామంలో నీటి సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడిందని, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి గ్రామంలో నీటి సమస్య లేకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

రైతులు ఆందోళన చెందొద్దు


పంటలను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి గోవింద్

డొంకేశ్వర్, సెప్టెంబరు 18 (ఆంధ్ర జ్యోతి): జిల్లాలో రైతులు యూరియా కోసం ఆందోళన చెందవద్దని రైతులకు సరిపడా యూరియా అందుబాటులో ఉందని భవిష్యత్తు అవసరాల కోసం తీసుకు వెళ్లవద్దని జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్ అన్నారు. డొంకేశ్వర్ మండలంలోని నూత్ పల్లి డొంకేశ్వర్ గ్రామాల్లోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైతులు నానో యూరియాని వాడాలని అవగాహన కల్పించారు. నానో యూరియా వాడడం వల్ల పర్యావరణ పరిరక్షణ పోషక విలువల సామర్థ్యం పెరుగుతుందని సూచించారు. నేలకు పంటకి మేలు జరుగు తుందని తెలిపారు. ఆయన వెంట మండల వ్యవసాయ అధికారి మధుసూదన్, ఏవో ప్రశాంత్, మౌనిక, రైతులు దేగం గంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


భళా .. సాహస వీరా

- ప్రపంచంలోనే ఎత్తైన ప్రాంతానికి చేరుకున్న బాన్సువాడ యువకుడు
- సముద్రమట్టం నుంచి 19,024 అడుగుల ఎత్తుకు ప్రయాణం
- గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్‌లో వంశీకృష్ణ

బాన్సువాడ టౌన్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): అది ప్రపంచంలోనే ఎత్తైన మోటారబుల్ రోడ్. దానిపేరు ఉమ్లింగ్ లా పాస్ (లడఖ్). ఇది సముద్రపు మట్టం నుంచి 19,024 అడుగుల ఎత్తు ఉంటుంది. సాహస యాత్రికులకు ఈ ప్రయాణం పెద్ద సవాలులాంటిది. కానీ బాన్సువాడ యువకుడు మాత్రం ఈ ఘనతను సాధించి గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో తన పేరును నమోదు చేసుకున్నాడు.

సాహస యాత్ర సాగిందిలా...

బాన్సువాడ పట్టణానికి చెందిన మచ్చ సంగీత , కొండల్‌రావు దంపతుల కుమారుడు వంశీకృష్ణ ఆగస్టు నెల 16న తన స్నేహితులతో కలిసి ద్విచక్ర వాహనంపై ఈ సాహసయాత్రను ప్రారంభించాడు. ఈ యాత్రలో మంచు కురియడం, కొండచరియలు విరిగి పడటం వంటివి సంభవించినా తమ ప్రయాణాన్ని ఆపకుండా ముందుకు సాగారు. కొన్ని చోట్ల రోడ్డు ఇబ్బందులున్నప్పటికీ బైక్‌తో నడుచుకుంటూ ప్రయాణంలో వెనకడుగు వేయకుండా ముందుకు సాగినట్లు ఆంధ్రజ్యోతితో తన అనుభవాన్ని పంచుకున్నారు. తక్కువ ఆక్సిజన్ లభ్యత వంటి ప్రతికూల పరిస్థితులను ధైర్యంగా ఎదుర్కొన్నారు. సవాళ్లను అధిగమించి విజయవంతంగా తమ గమ్యాన్ని సెప్టెంబరు 2 న చేరుకున్నారు.



ఉమ్లింగ్‌లా పాస్ చేరుకున్న బాన్సువాడ యువకుడు

ఈ రికార్డు చాలా గౌరవాన్ని తెచ్చిపెట్టింది
- వంశీకృష్ణ , బాన్సువాడ

గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్ నాకు చాలా గౌరవాన్ని తెచ్చి పెట్టింది. సాహసయాత్ర చేయాలనే తపనతో ఎన్ని అడ్డంకులు ఎదురైనా ముందుకు వెళ్లాం. యాత్రకు సహకరించిన స్నేహితులకు, తల్లిదండ్రులకు ప్రత్యేక ధన్యవాదాలు . ఈ రికార్డ్‌తో నాలో ధైర్యం, పట్టుదల, సాహసస్ఫూర్తిని నింపింది.

మహిళల ఆరోగ్యాన్ని పరిరక్షించాలి

● దొంగ్లి వైద్యురాలు శ్రీలేఖ


కొడిచర్ల ఆరోగ్య కేంద్రంలో మహిళలకు అవగాహన కల్పిస్తున్న వైద్యురాలు

మద్నూర్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మహిళల ఆరోగ్యాన్ని పరిరక్షించాలని, వారు ఆరోగ్య వంతులుగా ఉండటానికి. కేంద్ర ప్రభుత్వం స్వస్థనారి - స్వశక్తి పరివార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు దొంగ్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు శ్రీలేఖ తెలిపారు. గురువారం మండలంలోని కొడిచీర, మద్నూర్ సబ్ సెంటర్‌లలో ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యురాలు మాట్లాడుతూ మహిళల ఆరోగ్య పరిరక్షణ కోసం 15 రోజుల పాటు మండలంలోని ఆరు సబ్ సెంటర్లలో ప్రత్యేక వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి మహిళలకు సంబంధించిన వ్యాధులపై పరీక్షలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని వైద్య పరీక్షలు చేసుకోవాలని సూచించారు. మహిళలు ఉదయం నిద్ర లేచింది మొదలు రాత్రి మళ్ళీ నిద్రకు ఉపక్రమించే వరకు శ్రమిస్తూనే ఉంటారు. కుటుంబ ఆలన, పాలన పై దృష్టి పెట్టే క్రమంలో తమ ఆరోగ్యంపై శ్రద్ధ చూపరు. ఏమైనా సమస్యలు వచ్చినప్పుడు తాత్కాలికంగా మందులు వేసుకుని సరిపెట్టుకుంటారు. కానీ ఈ క్రమంలో వారికి సోకుతున్న దీర్ఘకాలిక వ్యాధుల గురించి పట్టించుకోరు. ఫలితంగా అవి ముదిరి వారి ప్రాణాలను హరిస్తున్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలోనే రాష్ట్ర ప్రభుత్వం 2023 మార్చి 8న ఆరోగ్య మహిళా పథకాన్ని ప్రారంభించి పరీక్షలు నిర్వహిస్తూ చికిత్సలు అందిస్తుందని మహిళల ఆరోగ్యాన్ని పరిరక్షించాలన్న లక్ష్యంతో తాజాగా కేంద్ర ప్రభుత్వం వరకు 15 రోజులపాటు స్వస్థనారి స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి బస్టాండ్‌లో స్వచ్ఛ భారత్

ఎల్లారెడ్డి, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పట్టణ కేంద్రంలోని ఆర్టీసీ ప్రాంగణంలో గురువారం బీజేపీ నాయకులు స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. భారతీయ జనతా పార్టీ ఆదేశాల మేరకు స్వచ్ఛ భారత్ కార్యక్రమం చేపట్టినట్లు వారు తెలిపారు. ప్రజలందరూ తమ ఇళ్లతో పాటు పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం బస్టాండ్ ప్రాంగణంలోని మరుగుదొడ్లను పరిశీలించారు. మరుగుదొడ్ల నుంచి దుర్గంధం వెదజల్లుతోందని, మరుగుదొడ్లను ఎప్పటికప్పుడు శుభ్రం ఉంచేలా ఆర్టీసీ అధికారులు సిబ్బందిని నియమించాలని డిమాండ్ చేశారు. ప్రయాణికులకు తాగునీటి సౌకర్యం సైతం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు రాజేష్, నక్క గంగాదర్, సతీష్, ఎస్.ఎన్ రెడ్డి, రమేష్, గజానంద్, పద్మ శ్రీను, శివ పాల్గొన్నారు.

రహదారుల మరమ్మతులకు నిధులు

పెద్దకొడప్‌గల్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన రహదారులు దెబ్బతినగా వాటి తాత్కాలిక మరమ్మత్తుల కోసం నిధులు మంజూరైనట్లు అధికారులు తెలిపారు. మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన రహదారులు ధ్వంసం కాగా ఇటీవల ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావ్ సమీక్ష నిర్వహించి ప్రతిపాదనలు తయారు చేయించారు. దీంతో రహదారులను తాత్కాలికంగా మొరం వేసి బాగు చేయించడానికి గాను ఎఫడిఆర్ (ఫ్లడ్ డ్యామేజీ రోడ్) కింద నిధులు మంజూరయ్యాయి. మండలంలోని మన్సూరాం తాండకు 72 వేలు, కాటేపల్లి రహదారికి 5 లక్షలు, పెద్ద దేవిసింగ్ తాండకు 60 వేలు, పెద్దకొడప్‌గల్ నుండి బేగంపూర్ తాండకు 80 వేలు, విఠల్‌వాడీ తాండకు 72 వేలు, దుబ్బతాండకు 1.5లక్షలు నిదులు విడుదల అయ్యాయని అధికారులు తెలిపారు. వీటితో త్వరలోనే రహదారులపై మొరం వేసి బాగు చేయిస్తామని అధికారులు తెలిపారు.

భావి తరాలకు జిల్లా చరిత్రను అందజేయడం కోసమే సమగ్ర చరిత్ర


మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీరేంద్ర

నిజామాబాద్ కల్చరల్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాబోయే తరాల వారికి జిల్లాలో జరిగిన సంఘటనలు సంబంధించిన ఉనికిని తెలియజేయడం కోసమే ఇందూరు సమగ్ర చరిత్ర సంస్కృతి పుస్తకాన్ని ఇతిహాస సంకలన సమితి ఆధ్వర్యంలో వెలువరించనున్నట్లు ఇతిహాస సంకలన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీరేంద్ర అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ఇందూరుకు గొప్ప చరిత్ర ఉందని రానున్న వారికి ఇందూరు చరిత్ర గురించి తెలియజేసే బాధ్యత మనందరిపై ఉందన్నారు. సరస్వతీ నది యొక్క అస్తిత్వాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన సంస్థ ఇతిహాస సంకలన సమితికి ఉందని అన్నారు. జిల్లాలోని రచయితలు, వ్యాసకర్తలు, చరిత్ర పట్ల ఆసక్తి ఉన్నవారు తమ దగ్గర ఉన్న అంశాలను సమితికి అందజేయడం ద్వారా ఈ పుస్తక నిర్మాణంలో భాగస్వాములు కావచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు జైకిషన్, నరేష్, మోహన్‌దాస్, శైలిబెల్లాల్, కందకుర్తి ఆనంద్, భూపతి, సాయిరెడి పాల్గొన్నారు.

విద్యార్థులను అభినందించిన గ్రామస్థులు


విద్యార్థులను అభినందిస్తున్న వీడీసీ సభ్యులు

ఆర్మూర్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఇటీ వల మండల అంతర్ పాఠశాలల క్రీడల్లో నాలుగు విభాగాల్లో బహు మతులు సాధించిన ఇస్సాపల్లి విద్యార్థులను గురువారం వీడీసీ సభ్యు లు అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని టోర్నమెంట్‌లలో ప్రతిభ చూపి గ్రామానికి పేరు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో రాజ్‌గంగారాం, ఆలూర్ సొసైటీ చైర్మన్ శ్రీనివాస్, ఆర్మూర్ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ జీవన్, వీడీసీ సభ్యులు మల్లేష్, భూమేష్, సంతోష్, మహేష్, శంకర్, ఆనంద్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సౌదాగర్ అరవింద్‌కు కాంగ్రెస్ పార్టీతో సంబంధం లేదు

● మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ సౌజన్య రమేష్

మద్నూర్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గానికి సంబంధించిన సౌదాగర్ అరవింద్‌కు కాంగ్రెస్ పార్టీతో ఎటువంటి సంబంధం లేదని మద్నూర్ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ సౌజన్య రమేష్ తెలిపారు. గురువారం మద్నూర్ మార్కెట్ కమిటీలో విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ 2024 ఎన్నికల కంటే ముందే సౌదాగర్ అరవిందును పార్టీ నుంచి ఆరు సంవత్సరాల పాటు సస్పెండ్ చేయడం జరిగిందని వెల్లడించారు. అయినప్పటికీ ఆయన పార్టీలో ఉన్నట్లు చెప్పుకుంటున్నారని అతడికి మా పార్టీతో ఎటువంటి సంబంధం లేదని తెలిపారు. ఇటీవల రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు సైతం ఉత్తర్వులు జారీ చేసి సౌదాగర్ అరవిందును సస్పెండ్ చేసినట్టు తెలిపారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించాలని పేర్కొన్నారు. ఆమెతో పాటు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ధరాస్ సాయిలు, మాజీ ఎంపీపీ ప్రజ్ఞాకుమార్, సీ నియర్ నాయకులు హన్మండ్లు స్వామి, తూమ రాములు తదితరులు ఉన్నారు.


మాట్లాడుతున్న ఏఎంసీ చైర్ పర్సన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు

మున్సిపల్ కార్మికులకు వేతన బకాయిలు చెల్లించాలి

● రూ.50లక్షలు చెల్లింపునకు అంగీకారం

బోధన్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికులకు రావాల్సిన వేతన బకాయిలను చెల్లించాలని తెలంగాణ ప్రగతిశీల మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర నేత మల్లేష్ మున్సిపల్ కమిషనర్ జాదవ్ కృష్ణతో గురువారం మాట్లాడారు. దసరా పండుగ సందర్భంగా మున్సిపల్ కార్మికులకు రావాల్సిన పీఆర్సీ బకాయిలను విడుదల చేసి, ఇతర సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కమిషనర్ తెలిపారు. కార్మికులకు రావాల్సిన వేతనాలు, చనిపోయిన, రిటైర్‌మెంట్ అయిన కార్మికులకు రావాల్సిన పీఎఫ్, పింఛన్ ఇతర బెనిఫిట్ల కొరకు అప్లికేషన్‌ల ఫారాలు నింపి ఇవ్వాలని వారి వారి బ్యాంక్ ఖాతాల్లో డబ్బులు జమ చేయడం జరుగుతుందని, చ్చనిపోయిన కార్మికుల స్థానంలో వారి వారసులను నియమించుట గురించి తదితర సమస్యలను పరిష్కారం చేస్తానని కమిషనర్ హామీ ఇచ్చారన్నారు. కార్మికులకు రావాల్సిన వేతన బకాయిలు, పీఎఫ్, ఈఎస్‌ఐలకు 50లక్షల రూపాయలు రిలీజ్ చేస్తున్నామని కమిషనర్ తెలిపారని వివరించారు. దసరా పండుగకు ఒక నెల కార్మికుల వేతనాలను ఇవ్వడానికి కమిషనర్ అంగీకరించారన్నారు.


కమిషనర్‌తోమాట్లాడుతున్న మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకుడు మల్లేష్

భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్‌ను కలిసిన జిల్లా ప్రతినిధులు

నిజామాబాద్ కల్చరల్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ భాషా సాంస్కృతి సంచాలకుడిగా నూతనంగా నియమితులైన ప్రముఖ కవి విమర్శకుడు డాక్టర్ ఏనుగు నర్సింహారెడ్డిని తెలంగాణ రచయితల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు హరిదా రచయితల సంఘం అధ్యక్షుడు ఘనపురం దేవేందర్ మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. జిల్లాకు సంబంధించిన పలు అంశాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు.


సన్మానిస్తున్న తెలంగాణ రచయిత సంఘం ప్రతినిధులు

అంగన్‌వాడీల్లో పోషణ మాస కార్యక్రమాలు


హసన్ టాక్లీ అంగన్‌వాడీ కేంద్రంలో మాట్లాడుతున్న అంగన్‌వాడీ టీచర్

మద్నూర్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి మద్నూర్ మండలం లో పోషణ మాసం కార్యక్రమాన్ని ఆయా అంగన్‌వాడీ కేంద్రాలలో గురువా రం ప్రారంభించారు. నెల రోజుల పాటు అంగన్‌వాడీ కేంద్రాలలో పోషణ మాసం కార్యక్రమాలు జరుగుతాయని అంగన్‌వాడీ వర్కర్లు, సచిత, చంపాబాయి తెలిపారు. అక్టోబర్ 16 వరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఇందులో భాగంగా భాగంలో గర్భిణీలు, బాలింతలు, తల్లులు, కిశోర బాలికలు 0 - 6 సంవత్సరాల లోపు పిల్లలకు బరువు ఎత్తు తీయడం జరుగుతుందని, ఆహారంలో చక్కెర నూనె తక్కువ ఉపయోగించాలని ఎక్కువ వా డటం వలన జరిగే నష్టాల గురించి అవగాహన కల్పించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో గ్రామ అధ్యక్షురాలు గంగామణి, ఆశ, అన్నపూర్ణ, అంగన్‌వాడీ టీచర్ సచ్చిత, చంపబాయి వేల్పర్ లక్ష్మీబాయి, గ్రామంలో తల్లులు, కిషోర్ బాలికలు పాల్గొన్నారు.

పనితీరును మెరుగు పరుచుకోవాలి


సిరికొండలో శిక్షణ పూర్తి చేసుకున్న అంగన్‌వాడి టీచర్లు

సిరికొండ, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): శిక్షణలో నేర్చుకున్న విషయాలతో పనితీరును మెరుగు పరుచుకోవాలని ఐసీడీఎస్ సీడీపీఓ స్వర్ణలతా అంగన్‌వాడీ టీచర్లకు సూచించారు. సిరికొండ మండల పరిషత్ కార్యలయంలో మూడు రోజులుగా జరుగుతున్న శిక్షణ శిబిరం ముగింపు సమావేశానికి సీడీపీఓ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా టీచర్లను ఉద్దేశించి స్వర్ణలతా మాట్లాడుతూ అంగన్‌వాడి కేంద్రాలకు వచ్చే పిల్లలకు అక్షరాలు, ఏ బీ సీ డీలు నేర్పించాలని కోరారు. శిక్షణలో నేర్చుకున్న విషయాలను తూ.చ తప్పకుండా పాటించి అమలు చేయాలని సీడీపీఓ కోరారు.పని విధానంలో మార్పులు చేసుకోవడమే కాకుండా మెరుగు పరుచుకోవాలని సీడీపీవో కోరారు. బరువు తక్కువగా ఉన్న పిల్లల ఆరోగ్యం పట్ల చాలా జాగ్రత్తలు తీసుకోవాలని అంగన్‌వాడీ టీచర్లను కోరారు.పిల్లలతో పాటు, తల్లులకు పౌష్టికావాహారాన్ని అందించాలని కోరారు. చిన్న పిల్లలకు ముర్రు పాలు తాగించడం వల్ల పిల్లలకు రోగనిరోదక శక్తి పెరుగడంతో పాటు ఆరోగ్యవంతులుగా పెరుగుతారని సీడీపీవో చెప్పారు. 0-6 వయస్సు గల పిల్లల అభివృద్ధిని ఎప్పటికప్పుడు గుర్తించాలని కోరారు. దివ్యాంగుల పిల్లల గుర్తించి కావలసిన పరికరాలను ప్రభుత్వం నుండి అందేల చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు.పిల్లలు లేని తల్లింద్రులు ప్రభుత్వం నుండి ఎలా దత్తత తీసుకోవాలో వివరంగా చెప్పాలని సీడీపీవో స్వర్ణలతా అంగన్‌వాడీ టీచర్లను కోరారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ పర్యవేక్షకులు మూలుగు సవిత, అరుణ కుమారి, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పోషకాహార వారోత్సవాలు


నసురుల్లాబాద్ అంగన్‌వాడీ సెంటర్‌లో పోషణ అభియాన్ వారోత్సవాలు నిర్వహిస్తున్న సీడీపీవో సౌభాగ్య

నసురుల్లాబాద్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): నస్రులాబాద్ అంగన్‌వాడీ టీచర్ల ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ సెంటర్‌లో పోషకాహార వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిడిపిఓ సౌభాగ్య హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కిశోర బాలికలకు ఆరోగ్య సిబ్బంది ద్వారా హెచ్ బీ టెస్ట్ నిర్వహించడం జరిగిందన్నారు. అనంతరం ఆరోగ్య సిబ్బందితో కలిసి విద్యార్థినులకు పోషకాహార వారోత్సవాలు భాగంగా ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు గౌరీ గంగామణి, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, విద్యార్థినిలు, పాల్గొన్నారు..

బ్లడ్ క్యాన్సర్‌ను చికిత్సతో నయం చేయొచ్చు



మాట్లాడుతున్న డాక్టర్ గణేష్ జైశెత్వార్

సుభాష్‌నగర్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): బ్లడ్ క్యాన్సర్ ప్రాణాంతకమైన వ్యాధి కాదని అత్యాధునిక వైద్య విధానం ద్వారా నయం చేయవచ్చని హైటెక్ సిటీ యశోద ఆసుపత్రి సీనియర్ వైద్యుడు డాక్టర్ గణేష్ జైశెత్వార్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్ మాసం రక్తక్యాన్సర్ మాసంగా జరపబడుతుందని అన్నారు. క్యాన్సర్‌కు అత్యంత ఖరీదైన వైద్యం అభివృద్ధి చెందిన దేశాల్లో రూ.10కోట్ల ఖర్చు అవుతుందని అన్నారు. హైదరాబాద్‌లో మాత్రం 20లక్షల్లోనే ఈ వైద్యం పూర్తవుతుందని తెలిపారు. జిల్లాకు చెందిన ప్రతాప్ అనే బాలుడు బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతూ చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని యశోద ఆసుపత్రిని సంప్రదించగా 2014 నుంచి 2017 వరకు చికిత్స అందించామని తెలిపారు. బాలుడు ప్రస్తుతం ఆరోగ్యంగా ఉన్నాడని క్రీడలతో పాటు చదువులో రాణిస్తున్నాడని అన్నారు. ఖచ్చితమైన వైద్యం రోగ నిరోధక చికిత్సలు లక్ష్యంగా చేసుకున్న మందులు అధునాతన ఎముక మజ్జ బోన్‌మ్యారో మార్పిడి కారణంగా అనేక రకాల రక్తక్యాన్సర్‌ను 90 శాతం నయం అవుతుందని తెలిపారు.

నోవా ఆసుపత్రి వైద్యులు రోబోటెక్‌తో 200 ఆపరేషన్లు


విజయనాదం చూపుతున్న డాక్టర్లు, తదితరులు

ఇందూరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని నోవా లైఫ్ ఆసుపత్రిలో 200 ఆపరేషన్లు విజయవంతంగా పూర్తి చేసుకొని చికిత్స పొందిన బాధితులతో సమ్మేళనాన్ని గురువారం ఆసుపత్రిలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నోవలైఫ్ ఆసుపత్రి వైద్యులు నవీన్ మాలు, దీపమాలు మాట్లాడుతూ నిజామాబాద్ జిల్లాలో అత్యధికంగా రోబోటిక్ నూతన టెక్నాలజీతో 200 ఆపరేషన్లు విజయవంతంగా పూర్తి చేయడం జరిగిందని తెలిపారు. కీళ్ల మార్పిడి, జనరల్ శస్త్ర చికిత్సలు జనరల్ చికిత్స విభాగము, స్త్రీవైద్య నిపుణులు, నెఫ్రాలజీ విభాగంలో అత్యంత సేవలు అందించడంలో వైద్యుల పాత్ర చాలా గొప్పదని అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఆనంద్‌మాలు, ఫిజీషియన్ డాక్టర్ అలోక్, ఈఎన్‌టీ స్పెషలిస్ట్ డాక్టర్ ప్రీతం, అనస్తీషియా స్పెషలిస్ట్, సిబ్బంది పాల్గొన్నారు.

దుబ్బ పాఠశాలకు టీవీ సెట్ల అందజేత

సుభాష్‌నగర్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి):నగరంలోని దుబ్బ ప్రభుత్వ పాఠశాలకు జోస్ అలుక్కాస్ యాజమాన్యం టెలివిజన్ సెట్, ప్రింటర్‌ను అందజేసింది. నగరంలోని దుబ్బ పాఠశాలలో గురువారం పాఠశాల ఉపాధ్యాయులకు జోస్ అలుక్కాస్ మేనేజర్ దినేష్, పీఆర్‌వో నరేందర్‌లు టెలివిజన్ సెట్, ప్రింటర్‌ను అందజేశారు. ఈ సందర్భంగా జోస్ అలుక్కాస్ మేనేజర్ దినేష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న డిజిటల్ ఎడ్యుకేషన్‌లో భాగంగా టెలివిజన్, ప్రింటర్‌ను విరాళంగా ఇస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ దాండె లక్ష్మి, ఎంఈవో ఆర్‌వీఎస్ గౌడ్, కాంప్లెక్స్ హెచ్‌ఎం శ్రీనివాస్, బీవీ రాజు, కేశవకుమార్, సంతోష్‌నానీ, లావణ్య, మోహన్, తదితరులు పాల్గొన్నారు.

పీఆర్టీయూ మోపాల్ మండల అధ్యక్షుడిగా దేవిదాస్

మోపాల్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మోపాల్ మండల పీఆర్‌టీయూ నూతన అధ్యక్షుడిగా కొట్టూరు దేవిదాస్, ప్రధాన కార్యదర్శిగా రాజశేఖర్, ఉపాధ్యక్షుడిగా నీరజలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం జరిగిన ఎన్నికలో పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగొనె కిషన్, జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్‌గౌడ్, మండల ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడితో పాటు ఏకగ్రీవంగా ఎన్నికైన మోపాల్ మండల ఉపాధ్యాయులు ఘనంగా అభినందించారు.

ఉద్యోగాలు ఇప్పిస్తానని మోసం

సుభాష్‌నగర్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి) నిజామాబాద్ నగరపాలక సంస్థలు ఉద్యోగాలు ఇప్పిస్తానని మోసం చేసిన సంఘటన గురువారం వెలుగు చూసింది. నవీపేట మండలం నాళేశ్వర్ గ్రామానికి చెందిన ప్రశాంత్ చిన్నయ్య అనే వ్యక్తి నగరపాలక సంస్థలు ఉద్యోగాలు ఇప్పిస్తానని రూ.2.10 లక్షలు తీసుకున్నాడు. ఎంతకీ ఉద్యోగం ఇప్పించకపోవడంతో . డబ్బులు కూడా తిరిగి ఇవ్వకపోవడంతో బాధితుడు ప్రశాంత్ గురువారం పోలీస్ కమిషనర్‌ను కలిసి ఫిర్యాదు చేసేందుకు వచ్చాడు. బాధితుడు ప్రశాంత్ చెప్పిన వివరాల ప్రకారం నగరపాలక సంస్థలో పనిచేస్తున్న అనిల్ అనే ఉద్యోగి తనకు పరిచయం అంటూ అనిల్ ద్వారా అనేక ఉద్యోగాలు ఇప్పించానని చిన్నయ్య చెప్పడం నమ్మకంతో తన దూరపు బంధువైన చిన్నయ్య కు డబ్బులు ఇచ్చానని ఆవేదన వ్యక్తం చేశాడు. వెంటనే చిన్నయ్య నుంచి డబ్బులు ఇప్పించాలని కోరాడు

నీట్ ర్యాంకర్‌కు సన్మానం


విద్యార్థినిని సన్మానిస్తున్న నలంద పాఠశాల యాజమాన్యం

సుభాష్‌నగర్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి):నీట్ పీజీ పరీక్షలో జాతీయ స్థాయి ర్యాంకు సాధించిన నలంద పాఠశాలలో చదివిన విద్యార్థిని భువనగిరి దీక్షితను యాజమాన్యం ఘనంగా సన్మానించింది. గురువారం పాఠశాల ఆవరణలో శాలువ, మెమోంటోతో ఘనంగా సన్మానించారు. నీట్ పీజీ పరీక్షలో జాతీయ స్థాయిలో 588వ ర్యాంకు సాధించి నలంద పాఠశాల ప్రతిష్టను ఇనుమడింపజేసిందని పాఠశాల అధ్యక్షుడు అట్లూరి మురళికృష్ణ తెలిపారు. మంచి డాక్టర్‌గా పేరు సంపాదించి సమాజ సేవలో ముందుండాలని సూచించారు. ఈకార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు నంగునూరు ప్రకాశం,సెక్రెటరీఇంగుశ్రీనివాస్,బోర్డ్‌మెంబర్ నేహా,దీక్షిత, తండ్రిశ్రీనివాస్, హెచ్‌ఎం పద్మావతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై మహిళలకు అవగాహన


మాట్లాడుతున్న ఏఎస్సై

మోపాల్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి):సైబర్ నేరాలపై మహిళలు అప్రమత్తంగా ఉండాలని మోపాల్ ఏఎస్సై నాగభూషణం మహిళలకు సూచించారు. గురువారం మోపాల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని న్యాల్‌కల్‌లో మహిళలతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ నేరగాళ్లు మాయ మాటలు చెప్పి ప్రజలను మోసం చేస్తున్నారని అన్నారు. వారి బారినపడి అనేక మంది డబ్బులు కోల్పోయారని వివరించారు. గుర్తుతెలియని ఫోన్‌లు, మెస్సేజ్‌లు వస్తే వెంటనే సంబంధిత పోలీసులను సంప్రదించాలని కోరారు.

డిగ్రీ కళాశాలకు సొంత భవనాన్ని నిర్మించాలి

ఇందల్వాయి, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి):డిచ్‌పల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు సొంత భవనాన్ని నిర్మించాలని కళాశాల కమిటీ ఆధ్వర్యంలో గురువారం విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా డిగ్రీ కళాశాల పీడీఎస్‌యూ అధ్యక్షురాలు వైష్ణవి మాట్లాడుతూ డిచ్‌పల్లి విద్యార్థులకు కనీస వసతులైన టాయిలెట్లు కూడా లేవని అన్నారు.

ప్రపంచ దేశాలు మోదీ నాయకత్వాన్ని కోరుకుంటున్నాయి

● అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్


రోడ్లను ఊడుస్తున్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా

సుభాష్‌నగర్,సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): మోదీలాంటి బలమైన నాయకత్వాన్ని ప్రపంచ దేశాలు కోరుకుంటున్నాయని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్త అన్నారు. జిల్లా కేంద్రంలోని బీజేపీ నాయకులు ప్రధాని నరేంద్రమోదీ జన్మదినం సందర్భంగా నిర్వహించిన స్వచ్ఛభారత్ కార్యక్రమంలో గురువారం పాల్గొన్నారు. దేవిరోడ్ చౌరస్తా నుంచి పాత గంజ్ కమాన్ వరకు ఎమ్మెల్యే రోడ్లను శుభ్రం చేసి చెత్తను ట్రాక్టర్‌లో ఎత్తిపోశారు. అనంతరం మహిళామోర్చ ఆధ్వర్యంలో అక్షరధామ్ పాఠశాలలో నిర్వహించిన చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలో పాల్గొని ప్రతిభను కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ భారత దేశాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని అన్నారు. ఆర్థిక, సాంకేతిక రక్షణ రంగాల్లో ప్రపంచ దేశాల్లో విశ్వగురువుగా నిలబెట్టాలన్న సంకల్పంతో మోదీ అహర్నిశలు శ్రమిస్తున్నారని అన్నారు. ప్రపంచ నాయకుడిగా మోదీ ఎదగడం భారతీయుడిగా గర్వించదగ్గ విషయమన్నారు. మోదీ జన్మదినం సందర్భంగా సేవా కార్యక్రమాలు నిర్వహించడం జరు గుతుందన్నారు. జిల్లా వ్యాప్తంగా అక్టోబర్ 2 వరకు ప్రతి గ్రామంలో సేవా కార్యక్రమాలు నిర్వహించి మోదీకి బహుమతిగా ఇవ్వాలని బీజేపీ నాయకులకు పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో బీజేపీ నాయకులు,మాజీ కార్పొరేటర్లు పాల్గొన్నారు.

● చెత్త నిల్వ ఉండటంపై ఎమ్మెల్యే సీరియస్

గత కొద్దిరోజులుగా నగరంలో చెత్త నిల్వలు ఉండటంపై అర్బన్ ఎమ్మె ల్యేధన్‌పాల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్క డున్న సిబ్బందిపై ఎమ్మెల్యే మండిపడ్డా రు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చెత్త సేకరణ రోజు జరగాలని చెత్త నిల్వలు కనిపి స్తే కఠినచర్యలు తీసుకుంటానని హెచ్చరిం చారు.

యోధుల చరిత్రను చెరిపివేసే కుట్ర

తెలంగాణ పోరాట యోధుల చరిత్రను గత ప్రభుత్వాలు చెరిపివేసే కుట్ర చేశాయని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్త అన్నారు. జిల్లా కేంద్రంలోని గిరిరాజ్ కళాశాల మైదానంలో కేంద్ర సమాచార మంత్రిత్వ శాఖ గురువారం ఏర్పాటు చేసిన హైదరాబాద్ విమోచన ఛాయాచిత్ర ప్రదర్శనను తిలకించారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ బ్యూరో క మ్యూనికేషన్ సమన్వయకర్త ధర్మానాయక్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామ్మోహన్‌రెడ్డి, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగోళ్ల లక్ష్మీనారాయణ, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.రంగరత్నం, పీఆర్‌వో డాక్టర్ దండు స్వామి, ఎన్‌సీసీ అధికారి లెఫ్టినెంట్ డాక్టర్ రామస్వామి, ఏవో రాంకిషన్, సూపరింటెండెంట్ విజయ్‌భాస్కర్, పాల్గొన్నారు.

సుభాష్‌నగర్: సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తబాధితులకు అందజే శారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో గురువారం చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధన్‌పాల్ మాట్లాడుతూ వివిధ కార ణాలతో అనారోగ్యంతో బాధపడి చికిత్స పొం దిన బాధితులకు సీఎం సహాయనిధి ద్వారా 110 మందికి రూ.22లక్షల 29వేల 500 విలు వగల చెక్కులను అందజేయడం జరిగిం దని తెలిపారు.

మోపాల్:బాడ్సి గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ ఓబీసీ మోర్చ రాష్ట్ర అధికార ప్రతినిధి స్వచ్ఛభారత్ అభియాన్ జిల్లా ప్రోగ్రాం కోఆర్డినేటర్ స్వామి యాదవ్ పాల్గొని విద్యార్థులు, ఉపాధ్యాయుల పాల్గొన్నారు.ఈకార్యక్రమంలో ఓబీసీ మోర్చ అసెంబ్లీ కన్వీనర్ రూరల్ గం గాధర్ యాదవ్, శశాంక్, సురేష్, కిషన్, గం గాధర్, మహేందర్, సతీష్,నర్సయ్య, రాములు పాల్గొన్నారు.

రూ.2400 కోట్ల మైలురాయికి డీసీసీబీ వ్యాపార కార్యకలాపాలు


కేక్ కట్ చేస్తున్న కుంట గంగారెడ్డి

ఇందూరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని జిల్లా సహకార బ్యాంకు 2400 కోట్ల మైలురాయికి చేరుకున్నందున గురువారం బ్యాంకు చైర్మన్ కుంట రమేష్ రెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్‌రెడ్డి మాట్లాడుతూ 787 కోట్లు డిపాజిట్‌లు, 1613 కోట్ల రుణాలతో 2400 కోట్ల వ్యాపార కార్యక్రమాలు నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. ప్రతి ఉద్యోగి లక్ష్యం, నిబద్ధత ద్వారా ఈ ఘనత సాధ్యమైందని రాబోయే కాలంలో ఇంకా వ్యాపార లావాదేవీలు పెంచి ఈ ఆర్థిక సంవత్సరం చివరకు మరింత వృద్ధి చేయా లని సూచించారు. నష్టాలలో ఉన్న శాఖను లాభంలోకి తీసుకొచ్చే విధంగా కృషి చేయాలన్నారు. ఎప్పటికప్పుడు సమీక్ష చేస్తూ క్షేత్రస్థాయిలో శాఖాధికారులను దిశనిర్దేశం చేస్తున్న సీఈవోతో పాటు ఉన్నతాధికారులను ప్రత్యేకంగా అభినందించారు. ఇటీవల జరిగిన వేతన సవరణకు సంబంధించి మొదటి విడత ఏరియల్ ఉద్యోగుల ఖాతాలో జమ చేసినందుకు కృతజ్ఞతగా ఉద్యోగ సంఘాల నాయకులు పాలకవర్గ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. భవిష్యత్తులో ఉద్యోగులు ఇంకా నిబద్ధతతో పనిచేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీఈవో నాగభూషణం, 63 శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆల్ఫోర్స్ కాలేజీలో ఘనంగా బతుకమ్మ సంబరాలు


ఆల్ఫోర్స్ కాలేజీలో బతుకమ్మ సంబరాలు జరుపుకుంటున్న విద్యార్థినులు

నిజామాబాద్ కల్చరల్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి):తెలంగాణ మహిళలు జరుపుకునే అతిపెద్ద పండుగైన బతుకమ్మ వేడుకలను ఆల్ఫోర్స్ కాలేజీలో ఘనంగా నిర్వహించారు. గురువారం కళాశాల ప్రాంగణంలో మహిళలు, ఉపాధ్యాయులు బతుకమ్మను పేర్చి బతుకమ్మ పాటలతో బతుకమ్మ ఆడారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కళాశాల అధినేత డాక్టర్ నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక అని స్త్రీశక్తికి ప్రతీక అని పర్యావరణాన్ని కాపాడుకోవాలనే ఉద్దేశ్యంతో ఈ పండుగ నిర్వహించుకుంటున్నా మని అన్నారు. కళాశాలలో విద్యార్థినులు అధ్యాపకులు బతుకమ్మ సంబరాలను ఆనందోత్సహాలతో జరుపుకోవా లని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ వెదురు దినోత్సవం

సుభాష్‌నగర్,సెప్టెంబరు18 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ వెదురు దినోత్సవ వేడుక లను బీసీ సంఘం, మ హేంద్ర సంఘం ఆధ్వర్యంలో ఘనం గా నిర్వహించారు. జిల్లా కేంద్రం లోని వినాయక్‌నగర్‌లోగల విగ్రహాల పార్క్ లో మహేంద్రుల ఆరాధ్యదైవం కేత య్య స్వామి విగ్ర హానికి పూలమాల లు వేసి నివాళులర్పిం చారు.ఈసందర్భంగా బీసీ సంఘం జిల్లా అధ్య క్షుడు నరాల సుధాకర్ మాట్లాడుతూ చేతి వృత్తు దారులైన మహేం ద్రు లకు ఎన్నో సమ స్యలు ఉన్నాయని సమస్యల పరిష్కారానికి ప్ర భుత్వాలు కృషి చేయాలన్నారు. హరితహారంలో వెదురిని ప్రోత్సహిం చాలన్నారు.ఈ కార్యక్రమంలో బీసీ సంఘం రాష్ట్రఉపాధ్యక్షుడు బుస్స ఆంజనేయులు, నాయకులు దర్శనం దేవే ందర్, కొయ్యాడ శంకర్, అజయ్, విజయ్,పాల్గొన్నారు.

ఇందల్వాయిలో ఆరోగ్య శిబిరం

ఇందల్వాయి,సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి):ఇందల్వాయి మండలం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్వస్త్ నారీ స్వశక్తి పరివార్ అభియాన్ ఆరోగ్య మహిళా శక్తివంతమైన కుటు ంబం కార్యక్రమంలో భాగంగా ఆరోగ్య శిబిరాన్ని గురువారం నిర్వహించారు. ఈ శిబిరంలో ఎముకలు, కీళ్ల వైద్య నిపుణులు డాక్టర్ సేహనాజ్, స్త్రీల వైద్యురాలు రమ్య, చర్మ వ్యాధి నిపుణురాలు డాక్టర్ అవంతి, కంటివైద్య నిపుణులు లక్ష్మీనర్సయ్యలు 200 మంది రోగులను పరీక్షించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రాజశ్రీ ఆకస్మికంగా తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ షోరోన్ ఫైనిక్రిస్టినా, ఆయుష్ వైద్యాధికారిని డాక్టర్ భువన, ఆరోగ్య పర్యవేక్షకులు , ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

బాలికల హాస్టల్ వార్డెన్‌గా జ్యోత్స్న

ఇందల్వాయి,సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): తెలంగాణ విశ్వవిద్యాలయంలో ఇంగ్లీష్ విభా గం అసి స్టెంట్ ప్రొఫెసర్ (కాంట్రాక్టు) డాక్టర్ ఎల్.జ్యోత్స్నను బాలికల హాస్టల్ వార్డెన్‌గా వీసీ టి.యాదగిరి రావు ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం.యాదగిరి నియామక పత్రం ఉత్తర్వులను గురువారం అందజేశారు.

నేడు విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక

సుభాష్‌నగర్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి):విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం విద్యుత్ ప్రజావాణిని శుక్రవారం నిర్వహిస్తున్నట్లు టౌన్-2 ఏడీఈ ప్రసాద్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని డి-5 సెక్షన్ పరిధిలోని గంగాస్థాన్‌లో ఉదయం 10.30ల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నగరంలోని డి-2, డి-3, డి-5, సుభాష్‌నగర్ సెక్షన్‌ల పరిధిలోని విద్యుత్ వినియోగదారులు సమస్యలను పరిష్కరించుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమానికి వినియోగదారుల ఫోరం చైర్‌పర్సన్ ఎరుకల నారాయణ హాజరై సమస్యలను విని పరిష్కరించనున్నట్లు తెలిపారు.

నిశిత కాలేజీలో ఘనంగా హిందీ దివస్

నిజామాబాద్ కల్చరల్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): నగరంలోని నిశిత డిగ్రీ కళాశా లలో హిందీ దివస్ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గత పక్షం రోజులుగా హిందీ దివస్‌లో భాగంగా గురువారం జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హిందీ సేవకులు అసోసియేట్ ప్రొఫెసర్ వరప్రసాద్ మాట్లాడుతూ డిజిటల్ మాధ్యమాల్లో హిందీ భాషా స్థితి అవకాశాలు అనే అంశంపై ప్రత్యేక ఉపన్యాసం ఇచ్చారు. హిందీ జాతీయ, రాజ్యభాషా అని విద్యార్థులకు తెలియజేశారు. ఈకార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ శేఖర్ అధ్యక్షత వహించగా అకాడమిక్ సలహాదారు సాయిలు, ప్రిన్సిపల్ స్వప్న, మనోజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న అధ్యాపకుడు

ఓటరు జాబితాలో తప్పులు లేకుండా సరిచేయాలి

మోపాల్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఓటరు జాబితాలో తప్పులు లేకుండా సరిచేయాల్సిన బాధ్యత బూత్ స్థాయి అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని మోపాల్ తహసీల్దార్ రేఖ వారికి సూచించారు. గురువారం మోపాల్ తహసీల్దార్ కార్యాలయంలో మండలంలోని ఆయా గ్రామాల బూత్‌స్థాయి అధికారులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. స్థానిక సంస్థలు ఎప్పుడు వచ్చిన ఓటరు జాబితాలో తప్పులు లేకుండా చూడాలని కోరారు. గ్రామ స్థాయిలో తయారు చేసిన ఓటరు లిస్ట్‌ను గ్రామపంచాయతీలో పెట్టాలని అన్నారు. ప్రభుత్వం ఏ క్షణంలోనైనా స్థానిక సంస్థల ఎన్ని కలను నిర్వహించవచ్చని అన్నారు. రెవెన్యూ అధికారులు అప్రమ త్తంగా ఉండాలని కోరారు.

రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా జట్ల ఎంపిక

సుభాష్‌నగర్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి సీనియర్ సెపక్‌తక్ర పోటీలకు జిల్లా జట్లను ఎంపిక చేసినట్లు జిల్లా సెపక్‌తక్ర అసోసియేషన్ కార్యదర్శి సంజీవ్‌రెడ్డి తెలిపారు. జిల్లా కేంద్రంలోని డీఎస్‌ఏ మైదానంలో గురువారం ఎంపికలు జరిగాయి. పురుషుల విభాగంలో ఉదయ్ కుమార్, పవన్‌కళ్యాణ్, శివకుమార్, సాత్విక్, వీర్‌సింగ్, మహిళల విభాగంలో శ్రీజ, శ్రేష్ఠ, పూజిత, భవ్యశ్రీ, లాస్యశ్రీలు ఎంపికయ్యారు. ఈనెల 20 నుంచి 22 వరకు మహబూబ్‌నగర్ జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలో వీరు పాల్గొంటారని తెలిపారు.

ప్రజాస్వామ్యంలో ఓటరే మూలస్తంభం


ధర్పల్లిలో ఓటు హక్కు కోసం క్యూలైన్‌లో ఉన్న విద్యార్థులు

ధర్పల్లి, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి):ప్రజాస్వామ్యంలో ఓటరే మూలస్థంభం అని మోడల్ పాఠశాల ప్రిన్సిపల్ శ్రీనివాస్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోగల మోడల్ పాఠశాలలో మాక్ ఎలక్షన్‌లు నిర్వహించారు. ఈ ఎలక్షన్‌లో 6వ తరగతి నుంచి 12వ తరగతి వరకు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు యొక్క విలువను తెలియజేస్తూ ఓటరే ప్రజాస్వామ్యంలో మూలస్థంభం అని విద్యార్థులు గ్రహించాలని ప్రిన్సిపల్ పేర్కొన్నారు. విద్యార్థులు తమ ఓటు హక్కు కోసం క్యూలైన్‌లో బారులుతీరి ఓటు హక్కును వినియోగించుకొని హెడ్‌బాయ్, హెడ్‌గర్ల్‌ను ఎన్నుకు న్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ నాగేశ్వర్‌రావు, అధ్యాపకులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ రెవెన్యూ విభాగం ప్రక్షాళన ఎప్పుడో?

(5వ పేజీ తరువాయి)

ఇటీవల కాలంలో నగర పాలక సంస్థలోని రెవెన్యూ విభాగంపై అనేక అవినీతి ఆరోపణలు వస్తున్న క్రమంలో ఆ శాఖను అడిషనల్ కమిషనర్‌కు అప్పగించేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. నగర పాలక సంస్థలో రెవెన్యూ శాఖలో ఏ పని కావాలన్నా చేయి తడపాల్సిన పరిస్థితి ఉంది. కిందిస్థాయి సిబ్బంది నుంచి సెక్షన్‌లను నిర్వహించే అధికారుల వరకు ఏ పనికైనా ఒక రేటు చొప్పున నిర్ణయించి పనులు చేస్తున్నట్లు బహిరంగంగానే ప్రచారం జరుగుతోంది. ఇప్పటి వరకు నగర పాలక సంస్థలో నమోదైన అవినీతి నిరోధక శాఖ కేసులు ఎక్కువగా రెవెన్యూ సెక్షన్‌లోనే నమోదు కావడం ఆ సెక్షన్‌పై ఉన్న ఆరోపణలను బలం చేకూరుస్తోంది.

తగ్గుతున్న మున్సిపల్ కార్పొరేషన్ ఆదాయం

నగర పాలక సంస్థలో అధిక ఆదాయం తీసుకువచ్చే రెవెన్యూ శాఖ అందులో పనిచేస్తున్న సిబ్బంది అక్రమాలకు పాల్పడుతుండటంతో కార్పొరేషన్ ఆదాయం పూర్తిగా తగ్గిపోతోంది. ఇంటి టాక్స్‌లతో పాటు వాణిజ్య సముదాయాల భవనాల కొలతలు తక్కువగా చూపుతూ రెవెన్యూ విభాగం సిబ్బంది కార్పొరేషన్ ఆదాయానికి గండి కొడుతున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే కలెక్టర్ మూడు నెలలుగా కార్పొరేషన్‌లో జరిగిన మ్యుటేషన్‌లు, ఇంటి టాక్స్‌లు, ఇతరత్ర ఫైళ్లను రీ వెరిఫికేషన్ చేయించారు.

టెట్టా.. ఎట్టెట్టా..!

(5వ పేజీ తరువాయి)

ఉపాధ్యాయ సంఘాల నేతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 2012 నుంచి టెట్ అర్హత సాధిస్తేనే డీఎస్సీలో అర్హత ఉంటుంది. 2012 డీఎస్సీ నుంచి ఉపాధ్యాయులు టెట్ పాస్ అయిన తర్వాతనే డీఎస్సీ రాస్తున్నారు. ఇటువంటి సందర్భంలో 2009 ఆగస్టు తర్వాత ప్రమోషన్స్ పొందిన ఉపాధ్యాయులు 2008లో డీఎస్సీ సాధించిన ఎస్‌జీటీలు మాత్రమే టెట్ రాయాల్సిన అవసరం ఉంది. వీరి సంఖ్య సుమారు 3వేల వరకు ఉంటుంది. ఈ పరిస్థితుల్లో టెట్ అనేది ప్రమోషన్ పొందిన ఉపాధ్యాయులు గుదిబండగా మారింది. చాలా మంది ఉపాధ్యాయులు టెట్ మినహాయింపు కోరుతూ కోర్టుకు వెళ్లినప్పటికీ కూడా కోర్టు భవిష్యత్ అవసరాలు దృష్ట్యా ప్రతి ఉపాధ్యాయుడు టెట్ పాస్ కావాల్సిందేనని తీర్పు నిచ్చింది.

గంజాయి, జూదం, పీడీఎస్ రైస్
అక్రమ రవాణాలపై ప్రత్యేక దృష్టి

(5వ పేజీ తరువాయి)

ఫిర్యాదు నమోదు చేయాలన్నారు. పోలీస్ స్టేషన్ల పరిధిలో డ్రంకెన్ డ్రైవ్‌లు, ఓవర్ స్పీడ్, త్రిబుల్ రైడింగ్, మైనర్లు వాహనాలు నడపడం వాటిపై ప్రత్యేక దృష్టిపెట్టి స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో అదనపు డీసీపీ అడ్మిన్ బస్వారెడ్డి, నిజామాబాద్, బోధన్, ఆర్మూర్ ఏసీపీలు రాజావెంకటరెడ్డి, జె.వెంకటరెడ్డి, శ్రీనివాస్, ఎస్‌బీ ఇన్స్‌పెక్టర్ శ్రీశైలం, సీసీఆర్‌బీ ఇన్స్‌పెక్టర్, సతీష్, సీఐలు, ఎస్సైలు తదితరులు పాల్గొన్నారు.

బాజిరెడ్డి అరాచకాలు అందరికీ తెలుసు

(5వ పేజీ తరువాయి)

2023 ఎన్నికల్లో బాన్సువాడ, బాల్కొండ, నిజాబాద్ అర్బన్, ఆర్మూర్‌లో సొంత పార్టీ ఎమ్మెల్యేలకు వెన్నుపోటు పొడిచి వారు ఓడిపోతే నీకు మంత్రి పదవి వస్తుందని చేసిన మోస పూరిత రాజకీయాలు ఉమ్మడి జిల్లాలో అందరికి తెలుసని గుర్తు చేశారు. ఏనుగు రవీందర్ రెడ్డి, షకీల్, పాండులు దిగజారుడు రాజకీయాలకు దిగి ఎమ్మెల్యే పోచారంపై కక్ష రాజకీయాలకు పాల్పడుతున్నారాని పోచారం భాస్కర్‌రెడ్డి విమర్శించారు.

యంచ గోదావరికి పోటెత్తిన వరద


యంచ గోదావరిలో తీరాన ప్రవహిస్తున్న వరద

నవీపేట,సెప్టెంబరు18(ఆంధ్రజ్యోతి): మండలంలోని యంచ గోదావరికి గురువారం వరద పోటెత్తింది. ఎగువలో ఉన్న మహారాష్ట్రలో భారీ వర్షాలు కురవడంతో గోదావరిలో నీటి ప్రవాహం పెరిగింది. మండలంలోని యంచలోని గోదావరి ఒడ్డున ఉన్నపలు చోట్ల పంటలు నీటమునగగా గోదావరి ప్రవాహం పెరగడంతో పక్కనే ఉన్న వైకుంఠ ధామం నీట మునిగింది. యంచనుంచి అల్లాపూర్ వెళ్లే రోడ్డు వరకు వరద నీరు చేరడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

ఎస్సారెస్పీలోకి 3 లక్షల 10 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

మెండోర: శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ఎగువ ప్రాం తం మహారాష్ట్రలో భారీగా కురుస్తున్న వర్షాలకు ప్రాజెక్టులోకి భారీగా వరద వచ్చి చేరుతోంది. ప్రాజెక్టులోకి 3 లక్షల 10 వేల క్యూసెక్కుల వరద చేరుతుండటంతో ప్రాజెక్టు 38 వరద గేట్ల ద్వారా ప్రాజెక్టు ప్రధాన కాలువల ద్వారా 3 లక్షల 10 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు 38 వరద గేట్ల ద్వారా గోదావరిలోకి 2 లక్షల 93 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రా జెక్టు నుంచి వరద కాలువ ద్వారా 6వేల క్యూసెక్కుల ఎస్కేపు గేట్ల ద్వారా గోదా వరిలోకి 4 వేల క్యూసెక్కులు, సరస్వతి కాలువ ద్వారా 400 క్యూసెక్కుల, ఆవిరి రూపంలో 701 క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కుల నీటిని విడు దల చేస్తున్నారు. ప్రాజెక్టులో ప్రస్తుత నీటిమట్టం 1086 అడుగుల 66 టీఎంసీల నీటి నిల్వ ఉంది.

సినిమా గైడ్

దేవి	: భద్రకాళి (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్	: మిరాయి (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్	: జాలీఎల్ఎల్‌బి-3 (హిందీ) (11.15, 2.15, 6.15, 9.15)
లలితామహాల్	: కిష్కింధపురి (11.15, 2.15, 6.15, 9.15)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్

స్క్రీన్-1	: ఇలాంటి సినిమా మీరెప్పుడు చూసుందరు (11.00)
	: మిరాయి (1.35, 4.35, 7.35, 10.35)
స్క్రీన్-2	: భద్రకాళి (10.50): కిష్కింధపురి (1.40, 7.30)
	: జాలీఎల్ఎల్‌బీ-3 (హిందీ) (4.30, 10.30)
స్క్రీన్-3	: మిరాయి (11.00)
	: జాలీఎల్ఎల్‌బీ-3 (హిందీ) (1.55): లిటిల్ హార్ట్స్ (4.45)
	: భద్రకాళి (7.30): మత్తు రా (10.30)

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణుమాల్)

స్క్రీన్-1	: జాలీ ఎల్ఎల్‌బీ-3 (హిందీ) (10.00)
	: మిరాయి (1.15, 7.25, 10.50): కిష్కింధపూరి (4.40)
స్క్రీన్-2	: మిరాయి (10.10, 4.05)
	: ఇలాంటి సినిమా మీరెప్పుడు చూసుందరు (1.35)
	: జాలీ ఎల్ఎల్‌బీ-3 (హిందీ) (7.30, 10.40)
స్క్రీన్-3	: లిటిల్ హార్ట్స్ (12.45, 7.55)
	: డెమన్ స్లయర్ (ఇంగ్లీష్) (3.30)
	: బ్యూటీ (10.40)
స్క్రీన్-4	: టన్నెల్ (10.50): దక్ష (1.40): జాలీ ఎల్ఎల్‌బీ-3 (హిందీ) (4.00): భద్రకాళి (7.15): కిష్కింధపురి (10.35)



బిస్కెట్ (10గ్రా.)	ఆర్నమెంట్(10గ్రా.)	వెండి(10గ్రా.)
రూ.1,15,000	రూ.1,06,100	రూ.1370

రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.170	రూ.260	రూ. 280
వెన్‌కాబ్(కిలో)	రూ.175	రూ.265	రూ. 285

